ప్రజాశక్తి

శనివారం 12 అక్టోబర్ 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి



ప్రయాణికులతో కిక్కిరిసిన ద్వారకా నగర్ ఆర్‌టిసి కాంప్లెక్స్

దసరా ప్రయాణాలతో..
బస్సులు, రైళ్లు కిటకిట
అదే అదునుగా 'ప్రైవేటు' దోపిడీ తీవ్రం

వార్త 2లో..

సర్కారీ ఖజానాకు దరఖాస్తుల కిక్కు !

- ఉమ్మడి విశాఖ జిల్లాలో చివరి రోజు వెల్లువలా అప్లికేషన్లు
- 14న షాపుల కేటాయింపు
- లాటరీ ఎవరిని వరించేనో ?
- 16 నుంచి బార్లా ప్రైవేట్ మద్యం దుకాణాలు
- అంతటా అధికార 'సిండికేట్లే'..!

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, అనకాపల్లి ప్రతినిధి, పాడేరు విలేకరి

మద్యం విధాన తొలిదశ ప్రక్రియ శుక్రవారంతో పూర్తయింది. ప్రయివేటు మద్యం అమ్మకాలు కొద్ది రోజుల్లో ప్రారంభంకానున్నాయి. ప్రయివేటు మద్యం అమ్మక విధానంతో కొన్నేళ్ల తరువాత సిండికేట్లు తెరపైకి వచ్చారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో పలుచోట్ల దరఖాస్తులు వెల్లువెత్తినా.. కొన్నిచోట్ల ఎక్కువ దరఖాస్తులు రాకుండా కొందరు 'రింగ్' అయినట్లు తెలుస్తోంది. ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు తమ పేర, కుటుంబ సభ్యుల పేర దరఖాస్తు చేయకుండా తమ సమీప బంధువులు, స్నేహితులతో దరఖాస్తులు చేయించి జాగ్రత్తలు తీసుకున్నట్లు సమాచారం.



ప్రభుత్వ నియంత్రణ మద్యం షాపులపై ఈ దఫా లేకపోవడంతో 'సిండికేట్ల' కనుసన్నల్లో మద్యం దుకాణాల కోసం దరఖాస్తులు వెల్లువెత్తాయి. నాన్ రిఫండబుల్ ఫీజు రూపంలో ప్రభుత్వ ఖజానాలోకి రూ.కోట్లు వచ్చి పడ్డాయి. దీంతో సర్కారీ ఖజానా దరఖాస్తులతో కిక్కెక్కిందంటూ పలువురు వ్యాఖ్యానించారు. 'కూటమి' ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మద్యం వేలం ప్రక్రియను ప్రవేశపెట్టింది. అంతకు ముందు టిడిపి హయాంలోనూ ఇదే సాగింది. గత వైసిపి హయాంలో మాత్రం ప్రభుత్వమే మద్యం షాపుల నిర్వహణ చేసింది. తాజాగా కూటమి పార్టీల 'మద్యం' విధానంతో వ్యాపారులకు, నేతలకు కలిసొచ్చినట్లయింది. ఎక్సైజ్ శాఖపై 'అధికార' పెత్తనం పెరిగే అవకాశాలున్నాయి.

నిన్నటి వరకూ వెలవెల ...నేడు వెల్లువలా...

తాజా మద్యం విధాన ప్రక్రియకు సంబంధించి ఈ నెల 10 నాటికి విశాఖపట్నం జిల్లాలో 155 షాపులకుగానూ 2841 దరఖాస్తులే వచ్చాయి. అనకాపల్లి జిల్లాలో 136 షాపులకుగానూ 2455, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 40కిగానూ 869 మాత్రమే వచ్చాయి. కానీ చివరి మిగతా 2లో..

పోర్టు ఆసుపత్రి ప్రైవేటీకరణ ఆపాల్సిందే..

సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు

ప్రజాశక్తి - సీతమ్మధార : విశాఖ పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆసుపత్రి ప్రైవేటీకరణను మోడీ ప్రభుత్వం ఆపకుంటే తీవ్ర ప్రజా ప్రతిఘటన తప్పదని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు హెచ్చరించారు. పోర్టు ఆసుపత్రిని పోర్టు నిధులతోనే 300 పడకల మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని, పిపిపి పేరుతో ప్రైవేటీకరణ చేయరాదని, ప్రైవేటీకరణ టెండర్లను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సిపిఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యాన సాలిగ్రాంపురంలోని పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆసుపత్రి ఎదుట ధర్నా, ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ పోర్టు ప్రగతిలో సంస్థ ఉద్యోగులు, కార్మికుల పాత్ర ఎంతో ఉందన్నారు. ఈ నేపథ్యంలో వారి ఆరోగ్యాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వం, పోర్టు యాజమాన్యంపైనే ఉందన్నారు. దశాబ్దాలుగా పోర్టు ఆసుపత్రి ఉపయుక్త సేవలను అందిస్తోందని గుర్తుచేశారు. ప్రభుత్వరంగ సంస్థలను, ఆస్తులను కార్పొరేట్లకు కట్టబెడుతున్న మోడీ ప్రభుత్వం పోర్టు ఆసుపత్రిని సైతం ప్రైవేటుకు కట్టబెట్టేందుకు పూనుకుందని తెలిపారు. ఈ క్రమంలోనే టెండర్లను ఆహ్వానించారన్నారు. దీంతో ఆసుపత్రిపై మిగతా 2లో..



ధర్నాలో మాట్లాడుతున్న జగ్గునాయుడు

స్టీల్‌ప్లాంట్‌పై బాబు భిన్న స్వరాలు

వార్త 2లో..

విశాఖ పోర్టుకు ఆస్ట్రేలియా బృందం

వార్త 2లో..

మొదటి పేజీ తరువాయి..

సర్కారీ ఖజానాకు దరఖాస్తుల కిక్కు!

రోజు శుక్రవారం వెల్లువలా దరఖాస్తులు వచ్చాయి. గడువు ముగిసేనాటికి విశాఖ జిల్లాలో సుమారు 3890కి, అనకాపల్లి జిల్లాలో 3,214కి, అల్లూరి జిల్లాలో 1203కి దరఖాస్తులు చేరాయి. విశాఖ జిల్లాలో సగటున ఒక దుకాణానికి 25 దరఖాస్తులు, అనకాపల్లి జిల్లాలో ఒక దుకాణానికి 24, అల్లూరి జిల్లాలో ఒక దుకాణానికి 29 దరఖాస్తులు వచ్చినట్టు తెలుస్తోంది.

అనకాపల్లిలో ఇలా..

జిల్లాలో మద్యం దుకాణాల లైసెన్సుల దరఖాస్తులు స్వీకరణ గడువు శుక్రవారం సాయంత్రం ఏడు గంటలతో ముగిసింది. 136 మద్యం దుకాణాలకు 3,214 దరఖాస్తులు రావడంతో ప్రభుత్వానికి రూ.64.28 కోట్ల ఆదాయం సమకూరినట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి సుధీర్ తెలిపారు. సగటున దుకాణానికి 24 దరఖాస్తులు చొప్పున వచ్చాయి. రాత్రి 12 గంటల వరకు ధరావత్తు సొమ్ము చెల్లించేందుకు అవకాశం కల్పించడంతో దరఖాస్తుల సంఖ్య మరో వంద వరకు పెరిగే అవకాశముంది. అనకాపల్లి, నర్సీపట్నం, యలమంచిలి, పాయకరావుపేట, చోడవరం, మాడుగుల, గొలుగొండ, సబ్బవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్లలో కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించారు. స్వీకరించిన దరఖాస్తులకు 14న లాటరీ ద్వారా మద్యం దుకాణాలను ఎక్సైజ్ శాఖాధికారులు కేటాయించనున్నారు. లాటరీ ద్వారా పొందిన ప్రయివేటు వ్యక్తులకు 15న దుకాణాలు అప్పగించనున్నారు. 16 నుంచి ప్రయివేటు మద్యం అమ్మకాలు ప్రారంభంకానున్నాయి. అత్యధికంగా గొలుగొండలో సగటున దుకాణానికి 29 దరఖాస్తులురాగా, సబ్బవరంలో తక్కువగా 17 చొప్పున వచ్చాయి.

స్టేషన్ వారీగా షాపులు, వచ్చిన దరఖాస్తుల వివరాలు

స్టేషన్	లైసెన్సు షాపులు	వచ్చిన దరఖాస్తులు	సగటు
అనకాపల్లి	15	372	25
సబ్బవరం	19	327	17
నర్సీపట్నం	21	543	26
గొలుగొండ	8	234	29
యలమంచిలి	20	560	28
చోడవరం	22	530	24
పాయకరావుపేట	18	364	20
వి.మాడుగుల	13	284	22
మొత్తం	**136**	**3,214**	**24**



ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

పోర్టు ఆసుపత్రి ప్రైవేటీకరణ ఆపాల్సిందే..

ఆధారపడిన 40 వేల మంది లబ్ధిదారుల ఆరోగ్యాలకు భద్రత కొరవడినట్లయిందన్నారు. కోవిడ్ సమయంలో ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులు ప్రజలను పీల్చి పిప్పి చేశాయని, ఆర్థికంగా దోచుకున్నాయని గుర్తుచేశారు. ధనం ఉన్న వారికే వైద్యం అందించాయన్నారు. దీనికి భిన్నంగా ప్రభుత్వాసుపత్రులు అశేష త్యాగాలతో సేవలు అందించాయన్నారు. వేలాది మంది కోవిడ్ రోగులను కాపాడిన విషయాన్ని గుర్తుచేశారు. దీనిలో విశాఖ పోర్టు ఆసుపత్రి విశిష్ట కృషి చేసిందన్నారు. విశాఖ పోర్టు స్టేడియంలో వందలాది బెడ్స్ వేసి ప్రజల ప్రాణాలను కాపాడిందన్నారు. కోవిడ్ విపత్తును గుణపాఠంగా తీసుకొని పలు అభివృద్ధి చెందుతున్న దేశాలు ప్రైవేటు వైద్యానికి బదులు ప్రభుత్వ వైద్యానికి ప్రాధాన్యతనిస్తున్నాయని తెలిపారు. కోవిడ్ సమయంలో తీవ్రంగా నష్టపోయిన దేశాల్లో భారతదేశం ఒకటని, కానీ మోడీ ప్రభుత్వం గుణపాఠాలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. ఉన్న ప్రభుత్వ వైద్యాన్ని ప్రైవేటుపరం చేసి ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా చేస్తోందని మండిపడ్డారు. పోర్టు అభివృద్ధి కోసం కృషి చేసిన, చేస్తున్న కార్మికులు, వారి కుటుంబాల ఆరోగ్యాల కన్నా కార్పొరేట్ల ప్రయోజనాలకే ప్రాధాన్యతనిస్తున్న కేంద్ర బిజెపి ప్రభుత్వ ప్రైవేటీకరణ చర్యలు ఎంత మాత్రమూ తగవన్నారు. తక్షణం రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాలని, స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు పోర్టు ఆసుపత్రి ప్రైవేటీకరణను ఆపించాలని డిమాండ్ చేశారు. పోర్టు నిధులతోనే మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.జగన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, బి.ఈశ్వరమ్మ, బి.పద్మ, జిల్లా కమిటీ సభ్యులు యుఎస్ఎన్.రాజు మాట్లాడుతూ పోర్టు ఆసుపత్రి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళన విజయం సాధించే వరకూ ప్రజలు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఆసుపత్రి రక్షణ కోసం పోరాడుతున్న పోర్టు సిఐటియు, ఇతర కార్మిక సంఘాలను అభినందించారు. పార్టీ జిల్లా నాయకులు పి.పైడిరాజు, అప్పలరాజు, వి.నరేంద్ర కుమార్, ఎం.రాంబాబు, బి.రమణి, ఎం.సుబ్బారావు, వెంకటరావు, సత్యనారాయణ, కెఎం.కుమార మంగళం, కె.కుమారి తదితరులు పాల్గొన్నారు.

దసరా ప్రయాణాలతో.. బస్సులు, రైళ్లు కిటకిట

అదే అదునుగా 'ప్రైవేటు' దోపిడీ తీవ్రం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దసరా పండగ నేపథ్యంలో విశాఖ నగరం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులతో ద్వారకా నగర్ ఆర్‌టిసి కాంప్లెక్స్‌తో పాటు రైల్వే స్టేషన్ శుక్రవారం కిక్కిరిసిపోయాయి. బస్ స్టేషన్‌లో బస్సులు కోసం వందలాది మంది ఎదురు చూడటం, తాము వెళ్లాలనుకునే బస్సు వచ్చిందని తెలియగానే.. మూకుమ్మడిగా పరుగులు తీయడం కానవచ్చింది. విపరీత రద్దీలో బస్సు ఎక్కేందుకు పలువురు అవస్థలు పడ్డారు. వృద్ధులు, వికలాంగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సీటు దొరక్కపోయినా కనీసం నిల్చొని వెళ్లేందుకు జాగా ఉంటే చాలు అని అనేక మంది భావించి ప్రయాణాలకు సిద్ధపడ్డారు. రైళ్లలోనూ ఇదే పరిస్థితి. ముందుగా రిజర్వేషన్లు చేసుకొన్న వారి పరిస్థితి వేరేగా ఉన్నప్పటికీ, అప్పటికప్పుడు ప్రయాణాలు పెట్టుకొని బయలుదేరిన వారు ప్రైవేటు బస్సులను ఆశ్రయించక తప్పలేదు. ప్రధానంగా దూర ప్రాంతాలకు వెళ్లే వారికి ఆర్‌టిసి బస్సులు తగినన్ని లేకపోవడంతో ప్రైవేట్ బస్సులను ఆశ్రయించారు. ఆర్‌టిసి వారు రెగ్యులర్ సర్వీసులు కాకుండా 200 బస్సులను దసరా కోసం అదనంగా వేశారు. అయితే గత ఏడాదితో పోలిస్తే ప్రయాణికుల రద్దీ విపరీతంగా ఉంది. ప్రత్యేక బస్సులను హైదరాబాద్‌కు 40, విజయవాడకు 40, కాకినాడ, రాజమండ్రి కలిపి 40, ఇటు శ్రీకాకుళం వైపు మిగిలిన బస్సులను వేశారు. ప్రైవేటు బస్సుల వారు ఇష్టానుసారంగా టికెట్ ధరలను పెంచినప్పటికీ తప్పక కొనుక్కుని మరీ జనం ప్రయాణాలు సాగించారు. విమానాశ్రయంలో కూడా పెద్ద ఎత్తున ప్రయాణికులు కనిపించారు. విమానం టికెట్లు ధరలు కూడా దసరా నేపథ్యంలో విపరీతంగా పెరిగాయి.



విశాఖ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల తాకిడి

ప్రైవేటు దోపిడీ

ప్రైవేటు ట్రావెల్స్ వారు ప్రయాణికులను విపరీతంగా దోచుకోవడం కనిపించింది. ఒకటికి రెండు రెట్లు టిక్కెట్ ధర పెంచి మరీ దోపిడీ చేసేశారు. విశాఖ నగరం నుంచి హైదరాబాద్‌కు ప్రైవేట్ ఎసి బస్సులో టికెట్ ధర సాధారణ రోజుల్లో రూ.700 నుంచి రూ.900 ఉండగా దసరా సందర్భంగా రూ.1800, రూ.2678, రూ.3000గా మారిపోయింది. విజయవాడకు రూ.1800 నుంచి రూ.2550 వసూలు చేస్తున్నారు.

విమానంలో సాధారణ రోజుల్లో హైదరాబాద్ టికెట్ రూ.3000 కాగా ఇప్పుడు అది రూ.5000 నుంచి రూ.7000కు పెరిగింది. కొన్ని ప్రైవేటు బస్సులు ఎటువంటి అనుమతులూ లేకుండానే దసరాకు తిరిగినట్టు భోగట్టా. ఫిర్యాదులు అందిన మేరకు ఎనిమిది బస్సులను రవాణా శాఖ అధికారులు సీజ్ చేశారు.

విశాఖ పోర్టుకు ఆస్ట్రేలియా బృందం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆస్ట్రేలియన్ కాన్సులేట్ డిప్యూటీ కాన్సుల్ జనరల్ డేవిడ్ ఎగుల్సటన్, ఆస్ట్రేలియన్ హై కమిషన్ ఫస్ట్ సెక్రటరీ గ్రేస్ విలియమ్స్‌తో కూడిన బృందం విశాఖపట్నం పోర్టును శుక్రవారం సందర్శించారు. పోర్ట్ డిప్యూటీ ఛైర్మన్ దుర్గేశ్ కుమార్ దూబే వారికి సాదర స్వాగతం పలికారు. విశాఖపట్నం పోర్టులో ఉన్న సౌకర్యాలు, పోర్టు అభివృద్ధికి చేపడుతున్న వ్యూహాత్మక కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. భవిష్యత్తులో ఆస్ట్రేలియాతో వ్యాపార సంబంధాలకు అవసరమైన సహకారాన్ని అందజేస్తామని దూబే తెలియజేశారు. ఆస్ట్రేలియా నుంచి కొకింగ్ కోల్‌ను దిగుమతి చేసుకుంటున్నామని, దాన్ని విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు పంపిస్తున్నామని తెలిపారు. భారత్‌కు కావలసిన కోల్ అవసరాలను తీర్చే అవకాశం కలిగినందుకు సంతోషంగా ఉందని డేవిడ్ ఎగుల్సటన్ తెలిపారు. విశాఖపట్నం పోర్టులో క్రూయిజ్ టెర్మినల్‌కు భారీ అవకాశాలు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. వ్యాపార సౌలభ్యం, టర్న్ రౌండ్ టైమ్, కస్టమ్స్ క్లియరెన్స్, పోర్ట్ కనెక్టివిటీ, ట్రాన్స్ షిప్‌మెంట్, క్రూయిజ్ పాసింజర్స్, ట్రాఫిక్, డ్రెడ్జింగ్ మొదలైన అంశాలను క్షుణ్ణంగా చర్చించారు. విశాఖ పోర్టు ఆతిథ్యం పట్ల సంతోషం వ్యక్తపరిచారు.



పోర్టు కార్యాలయంలో ఆస్ట్రేలియా బృందం సభ్యులు

స్టీల్‌ప్లాంట్‌పై బాబు భిన్న స్వరాలు

మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎన్నికలకు ముందు వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపుతామని సిఎం చంద్రబాబు మాట ఇచ్చారని, నేడు ఎన్నికల మ్యానిఫెస్టో మాట నిలబెట్టుకుంటారా ? అని అడిగితే తనకేమీ అర్థం కావడం లేదని అంటున్నారని వైసిపి మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై చంద్రబాబు ద్వంద్వ వైఖరి అవలంబిస్తూ భిన్న స్వరాలు వినిపిస్తున్నారన్నారు. శుక్రవారం సాయంత్రం బీచ్ రోడ్డులోని ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అమర్‌నాథ్ మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్‌పై మీకు అర్థం కాకుండా ఎలా మాట ఇచ్చారని చంద్రబాబును ప్రశ్నించారు. చంద్రబాబు కార్మికుల జీవితాలతో ఆటలు ఆడుతున్నారన్నారు. ఎన్‌డిఎలో భాగస్వామిగా ఉండి చంద్రబాబు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపలేకపోతున్నారన్నారు. కొన్ని నెలలుగా ఉక్కు కార్మికులకు జీతాలు ఇవ్వడం లేదని, పండగ పూట పస్తులు ఉండే పరిస్థితి కార్మికులకు ఏర్పడిందని తెలిపారు. రానున్న వారం రోజుల్లో స్టీల్ ప్లాంట్ రక్షణ కోసం పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపడతామని, వైఎస్ జగన్ ఆధ్వర్యంలో పోరాటం జరుగుతుందని అన్నారు. సమావేశంలో మాజీ శాసన సభ్యులు తిప్పల నాగిరెడ్డి, చింతలపూడి వెంకట రామయ్య, తిప్పల గురుమూర్తి రెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి రెడ్డి పాల్గొన్నారు.

దేవరగట్టు బన్నీ ఉత్సవంలో

హింసకు అడ్డుకట్ట వేయాలి

హోంమంత్రికి భారత నాస్తిక సమాజం వినతి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: కర్నూలు జిల్లా హోలగుండ మండలం దేవరగట్టులో విజయదశమి సందర్భంగా శనివారం జరుగు బన్నీ ఉత్సవంలో అగ్గి దివిటీలు, రింగులు తొడిగిన కర్రలను నిషేధించాలని రాష్ట్ర హోంమంత్రికి భారత నాస్తిక సమాజం విజ్ఞప్తి చేసింది. ఈ వేడుకకు . సుమారు రెండు లక్షల మంది భక్తులు మాల మల్లేశ్వర స్వామి విగ్రహాలను స్వాధీనం చేసుకోవడానికి రెండు గ్రూపులుగా అగ్గి దివిటీలు ,రింగులు తొడిగిన కర్రలతో దాడి చేసి కర్కశంగా కొట్టుకుంటారనీ, ఈ దాడిలో ఏటా వందలాదిమంది తీవ్రంగా గాయపడి అంగవైకల్యం పొందుతున్నారని భారత నాస్తిక సమాజం కేంద్ర కమిటీ నాయకులు టి. శ్రీరామమూర్తి, జె.రవి ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. భారీగా పోలీసు బందోబస్తు ఉన్నా, ప్రేక్షక పాత్ర వహించాల్సి వస్తుందన్నారు. ఇదంతా మూఢ భక్తి అని, రాజ్యాంగం ఆర్టికల్ 21 ప్రకారం జీవించే హక్కుకు ఉల్లంఘన అన్నారు. దీనిపై కొన్నేళ్లుగా అధికారులకు లేఖలు రాస్తున్నా, రాజకీయ నాయకుల ప్రమేయం ఉండటం వల్ల అడ్డుకట్ట పడడం లేదన్నారు. గత ఏడాది ఈ ఉత్సవంలో 90 మంది గాయపడగా, ఆసుపత్రిలో ఐదుగురు చనిపోయారన్నారు. ఈ హింసను ఆపడానికి శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బన్నీ ఉత్సవం జరుగు చుట్టుప్రక్కల గ్రామాలలో వైజ్ఞానిక తరగతులు నిర్వహించి, హింసను అరికట్టే చర్యలు చేపట్టాలని రాష్ట్ర హోంమంత్రి అనితకు విజ్ఞప్తి చేశారు.

సందడిగా బతుకమ్మ సంబరాలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఉక్కునగరంలోని సీ భవన్‌లో బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఆటాపాటలతో సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేవిధంగా బతుకమ్మ పాటలతో ఉత్సాహంగా వేడుకలను జరుపుకున్నారు. తొలుత స్టీల్‌ప్లాంట్ ఇన్‌చార్జి సిజిఎం (వర్క్స్) యు.శ్రీధర్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్‌లో తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఉక్కు ఉద్యోగుల కుటుంబాలు ఏటా ఆనవాయితీగా బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. సంఘం అధ్యక్షులు ఎన్.కుమార స్వామి అధ్యక్షతన జరిగిన వేడుకల్లో జనరల్ మేనేజర్లు రవిశేఖర్, ఆచారి, డాక్టర్ నవీన్ కుమార్, ఎన్ వీరేశం, కాంట్రాక్టర్ ఎ.మురళీధర్ రెడ్డి, సంఘం ప్రధాన కార్యదర్శి జి. ఆనంద్, ప్రతినిధులు బి. వెంకటేశ్వర్లు, జి. మల్లేశం, ఎన్.నర్సింగరావు, ఎం.వేణుగోపాల్, టి.ప్రభాకర్, సిహెచ్ రవికుమార్, ఎం.చంద్రశేఖర్, చంద్రకిరణ్, ఎంకెవిఆర్ మోహన్‌రావు, సీ ప్రధాన కార్యదర్శి కెవిడి ప్రసాద్, జాయింట్ సెక్రటరీ ఆర్.నరసింహ, బి. గణేష్ పాల్గొన్నారు

నిర్దేశిత ప్రదేశంలోనే నిమజ్జనాలు

ప్రజాశక్తి -మధురవాడ : పిఎం.పాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని దుర్గానవరాత్రి ఉత్సవాలను నిర్వహించిన ఉత్సవ కమిటీలు అమ్మవారి విగ్రహాలను సాగర్‌నగర్ వద్ద కేటాయించిన నిర్దేశిత ప్రదేశంలోనే నిమజ్జనాలు చేయాలని పిఎం పాలెం సిఐ జి. బాలకృష్ణ తెలిపారు. పోలీసులు, అధికారుల సూచనలను ఉత్సవ కమిటీలు విధిగా పాటించాలని, ఇతర ప్రదేశాల్లో నిమజ్జనాలు చేయడం నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తుందని హెచ్చరించారు

14న పిజిఆర్ఎస్‌కు ఎమ్మెల్యే గంటా

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఈ నెల 14న, సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పాల్గొని, ప్రజలనుంచి అర్జీలు స్వీకరిస్తారని టిడిపి మండల అధ్యక్షులు డిఎవి రాజు తెలిపారు. ప్రజలు వినియోగించుకోవాలని కోరారు

అన్నసమారాధన

ప్రజాశక్తి- సీతమ్మధార : జివిఎంసి 46వ వార్డు కస్తూరినగర్ -2, అలాగే 47వ వార్డు సంజీవయ్య కాలనీ దుర్గమాంబ సేవాసంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. జివిఎంసి డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ అన్నసమారాధనను ప్రారంభించారు.కార్యక్రమంలో కమిటీ సభ్యులు బొట్టా రాజు, ఎంవి రమణ, కృప, సాయి పాల్గొన్నారు.

20న విశాఖ పౌర గ్రంథాలయంలో

ప్రజాకవి గద్దర్ స్మృత్యంజలి

ప్రజాశక్తి- విశాఖ కల్చరల్ : తెలుగు ప్రజాయుద్ధనౌక, ప్రజాకవి, గాయకుడు గద్దర్‌కు నివాళులర్పిస్తూ ఈ నెల 20న ద్వారకనగర్ పౌర గ్రంథాలయం సమావేశ మందిరంలో మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 7 వరకు 'ప్రజా యుద్ధ నౌక గద్దర్ అన్న యాదిలో' పేరున కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రజా గాయకుడు మజ్జి దేవిశ్రీ తెలిపారు. బహుజన కళా మండలి నిర్వాహకులు చౌటుపల్లి శేషుతో కలిసి ప్రచార పోస్టరును శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనన్నారు. ఈ సమాజం ఉన్నంతకాలం గద్దర్ ప్రజా సాహిత్యం సజీవంగా ఉంటుందని దేవిశ్రీ అన్నారు. గొప్ప పాటలు రాసిన చరిత్ర గద్దర్ నేపథ్యం అనేక కళాబృందాలు ద్వారా గద్దర్ గొప్పతనాన్ని, గద్దర్ సాహిత్యాన్ని జనంలోకి తీసుకెళ్లడంలో ముందున్నారని తెలిపారు. కార్యక్రమానికి గద్దర్ కుమార్తె వెన్నెల గద్దర్ హాజరవుతారని తెలిపారు. గద్దర్ పాట వినని వారంటూ ఉండరని అటువంటి ప్రజా యుద్ధ నౌక గద్దర్‌ను ఒకరోజు స్మరించుకునే కార్యక్రమానికి అందరూ రావాలని పిలుపునిచ్చారు. అనేక కళా సంఘాలు, సంస్థల ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.



పోస్టరు ఆవిష్కరిస్తున్న ప్రజా గాయకుడు దేవిశ్రీ

ప్రజా కళా మండలి, ప్రజానాట్యమండలి, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య, ప్రజా ఉద్యమ అమర కళాకారుల వేదిక, జన చైతన్య మండలి, విశ్వజన కళామండలి, ఉత్తరాంధ్ర సంగీత జానపద కళా పీఠం, పర్యావరణ కళామండలి, బహుజన కళా మండలి వివిధ సంస్థలు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని ప్రజా గాయకుడు మజ్జి దేవిశ్రీ తెలిపారు.

ఐదేళ్లలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు

ఎంఎస్ఎంఇ ఛైర్మన్ శివశంకర్



మాట్లాడుతున్న ఎంఎస్ఎంఇ ఛైర్మన్ శివశంకర్

ప్రజాశక్తి -గాజువాక : పారిశ్రామిక అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, వచ్చే ఐదేళ్లలో ఎంఎస్ఎంఇ ద్వారా ప్రైవేట్ రంగంలో యువతకు 20 లక్షల ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నట్లు ఎంఎస్ఎంఇ ఛైర్మన్ టి శివశంకర్ అన్నారు. శుక్రవారం గాజువాక ఆటోనగర్‌లో వాసవ ఆధ్వర్యంలో పరిశ్రమల యజమానులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పరిశ్రమ యజమానులతో సమావేశంలో మాట్లాడుతూ, చిన్న మధ్యతరగతి పరిశ్రమల అభివృద్ధి, అవి నిలదొక్కుకోవడానికి ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు తెలిపారు. ఎంఎస్ఎమ్ఇ ద్వారా దేశవ్యాప్తంగా ఆరు కోట్ల మందికి ఉపాధి కల్పిస్తామని, ఈనెల 18న దీనికి సంబంధించిన ప్రకటన రానుందన్నారు. 19న నిర్వహించే సమావేశంలో స్పష్టత వస్తుందన్నారు. పరిశ్రమలు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవర్చుకోవాలన్నారు. పారిశ్రామిక రంగ అభివృద్ధిలో ఉత్తరప్రదేశ్, బీహార్ కంటే వెనుకబడి ఉన్నామని, దేశవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ ఏడోస్థానంలో ఉందన్నారు. ఒకటోస్థానం చేరుకునేందుకు పరిశ్రమల యాజమాన్యాలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వాసవ అధ్యక్షులు సజ్జ పాండురంగ ప్రసాద్, ట్రెజరర్ ఐసోటెక్ ప్రభాకరరావు, ఇలా మాజీ ఛైర్మన్ వై సాంబశివరావు, ఐలా ఛైర్మన్ కె.సత్యనారాయణ రెడ్డి, సెక్రెటరీ చీకటి సత్యనారాయణ, గాజువాక ఆటోనగర్ వివిధ పరిశ్రమ యజమానులు పాల్గొన్నారు.

ప్రభుత్వాల దృష్టికి జర్నలిస్టుల సమస్యలు

ప్రజాశక్తి- సీతమ్మధార : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి జర్నలిస్టుల సమస్యలను తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేయనున్నట్లు జర్నలిస్టుల సంఘం జాతీయ కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, నగర అధ్యక్షులు పి నారాయణ్ తెలిపారు. శుక్రవారం అక్కయ్యపాలెంలో ప్రయివేటు హోటల్‌లో ఎపి వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఎపి బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్, ఎపి స్మాల్ అండ్ మీడియం న్యూస్‌పేపర్స్ అసోసియేషన్ కార్యవర్గాలు ప్రత్యేకంగా సమావేశమయ్యాయి. ఈ నెల 16న రాష్ట్ర సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథితో విజయవాడలో ప్రత్యేకంగా సమావేశమై జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్లు సరళీకరణ, విశ్రాంత జర్నలిస్టులకు పెన్షన్, ప్రమాద బీమా, జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య, అన్ని కమిటీల్లో జర్నలిస్ట్ సంఘాలకు ప్రాతినిధ్యం వంటి సమస్యలను విన్నవించనున్నట్లు తెలిపారు. అలాగే ఢిల్లీలో ఢిల్లీ జర్నలిస్టు యూనియన్ ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో నిర్వహించనున్న సమావేశంలో ప్రధాన సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో ఫెడరేషన్ నగర కార్యదర్శి జి.శ్రీనివాసరావు, బ్రాడ్ కాస్ట్ అసోసియేషన్ నగర అధ్యక్షులు ఇరోతి ఈశ్వరరావు, మదన్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జగన్ మోహన్, కార్యదర్శి కె. శ్రీనివాస్ రావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పూజా సామగ్రి ధరలకు రెక్కలు

ప్రజాశక్తి -తగరపువలస : దసరా పండుగ సందర్భంగా పూజా సామగ్రి ధరలకు రెక్కలు వచ్చాయి. స్థానిక మార్కెట్‌లో కొబ్బరి కాయ, అరటి పండ్ల ధరలు ఒక్కసారిగా పెరిగాయి. డజను అరటి పండ్లు వారం రోజుల కిందట రూ.60 నుంచి రూ.70 ఉండగా, శుక్రవారం ఏకంగా రూ.100 దాటేసింది. ఇక కొబ్బరి కాయ ధర రూ 15 ల నుంచి ఏకంగా రూ 30లకు చేరింది. డజను జీడి పిక్కలు రూ.6 ల నుంచి రూ 10 లకు, ఐదు నిమ్మకాయలు రూ 10 ల నుంచి రూ 20 లకు, పూలదండ రూ.30 ల నుంచి రూ 60 లకు అలాగే రూ 40ల నుంచి రూ.80 లకు పెరిగాయి. రెట్టింపు మించిపోయేలా పూజాసామగ్రి ధరలు పెరగడంతో ప్రజలు అవాక్కయిపోయారు. అయితే పండుగకు ఇవన్నీ అవసరం కావడంతో పరిమితంగానే కొనుగోళ్లు చేపట్టారు.



మార్కెట్‌లో అమ్మకానికి కొబ్బరి కాయలు, అరటి పండ్లు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో

వైద్య విద్యార్థిని దుర్మరణం

ప్రజాశక్తి - ఆరిలోవ : జాతీయ రహదారిపై జూ పార్కు సమీపంలో లో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదం వైద్య విద్యార్థిని దుర్మరణం చెందింది. ఆరిలోవ ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలివి. ఎండాడకు చెందిన కాంచన ఆమె కుమార్తె నిషిత(20) శుక్రవారం మధ్యాహ్నం స్కూటీపై నగరానికి వెళ తున్నారు. జూపార్కు సమీపంలో వెనుకనుంచి వస్తున్న ఇండియన్ ఆయిల్ ట్యాంకర్ వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో స్కూటీ వెనుక కూర్చున్న నిషిత వాహనంపై నుంచి తుళ్లిపోయి కిందపడిపోయింది. ట్యాంకర్ నిషిత తలపైకి ఎక్కడంతో నుజ్జునుజ్జయ్యి అక్కడే ప్రాణాలు కోల్పోయింది. స్కూటీ నడుపుతున్న తల్లి కాంచనముఖానికి గాయాలయ్యాయి. నిషిత ఎన్ఆర్ఐ కాలేజీలో రెండో ఏడాది ఎంబిబిఎస్ చదువుతోంది. వైద్యురాలు కావల్సిన తన కూతురు దుర్మరణం చెందడంపై తల్లి కాంచన కన్నీరు పర్యంతమయ్యింది. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ సిఐ ప్రసాద్, ఎస్ఐ శ్రీకాంత్ సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం వివరాలు నమోదు చేసారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు.

ప్రైవేట్ ట్రావెల్ బస్సుల తనిఖీలు



తనిఖీలు చేస్తున్న రవాణాశాఖ అధికారులు

ప్రజాశక్తి-ఉక్కునగరం : ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై విశాఖలో రవాణాశాఖ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. విశాఖ డిటిఒ ఆదేశాల మేరకు అగనంపూడి టోల్‌గేట్ వద్ద రెండురోజులుగా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను ఆర్‌టిఒ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. శుక్రవారం ఉదయం తనిఖీల్లో భాగంగా సరైన పత్రాలు లేని వాహనాలను గుర్తించిన అధికారులు వాటిని సీజ్ చేస్తున్నారు. నిర్దిష్ట ధర కంటే టిక్కెట్‌పై అధిక మొత్తంలో ప్రయాణికుల నుంచి వసూలు చేస్తున్న బస్సులపై కేసులు నమోదు చేసినట్లుగా అధికారులు తెలిపారు. దసరా సందర్భంగా సొంతూళ్లకు వచ్చే వారి నుంచి సంఖ్య అధికంగా ఉండడంతో, డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని టిక్కెట్ ధరలను పెంచడంతోపాటు, సరైన పత్రాలు, అనుమతులు లేకుండానే ప్రైవేటు బస్ సర్వీసులను భారీ ఎత్తున బస్సులను నడుపుతున్నారనే ఆరోపణల నేపథ్యంలో రవాణాశాఖ అధికారులు నిఘాపెట్టి తనిఖీలు చేస్తున్నారు.

ఘనంగా బాలికల దినోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి- సీతమ్మధార : అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం నుంచి నిర్వహించిన అవగాహన ర్యాలీని డిఎంహెచ్ఓ డాక్టర్ పి.జగదీశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. డిఎంహెచ్ఓ కార్యాలయం నుంచి సత్యం జంక్షన్ మీదుగా ర్యాలీ సాగింది. ఈసందర్భంగా డిఎంహెచ్ఓ డాక్టర్ జగదీశ్వరరావు మాట్లాడుతూ, నేటి సమాజంలో బాలురు కంటే బాలికలు తక్కువగా ఉన్నారని, సమ నిష్పత్తిలో స్త్రీపురుషులు ఉండేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పిసి, పిఎన్‌డిటి చట్టం ప్రకారం లింగ నిర్ధారణ పరీక్షలు నేరమని, చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

బాలికల హక్కులపై వారికి అవగాహన కల్పించడానికి ఏటా అక్టోబర్ 11నఅంతర్జాతీయ బాలికల దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. లింగ వివక్ష రూపుమాపడం, మహిళా సాధికారత కోసం పోరాటం బాలికా దినోత్సవం లక్ష్యమన్నారు.. ఈ ఏడాది 'గర్ల్స్ విజన్ ఫర్ ది ఫ్యూచర్' అనే థీమ్‌తో అంతర్జాతీయ బాలికల దినోత్సవం జరుపుకొంటున్నామన్నారు. జిల్లా విస్తరణ ప్రచారణ అధికారి .బి.నాగేశ్వరరావు, ప్రోగ్రాం అధికారులు, ట్రైనీ నర్సు, బి.నాగభూషణం, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రంగుల ముగ్గులతో మానసిక ఆరోగ్యం



రంగులతో ముగ్గులు వేస్తున్న గీతం విద్యార్థులు

ప్రజాశక్తి- మధురవాడ : రకరకాల రంగుల రంగోలీలు మనిషి మనస్సుపై, మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయని గీతం వర్సిటీ ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతంరావు అన్నారు. శుక్రవారం ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా గీతం వర్సిటీలో నిర్వహించిన రంగుల రంగోలీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మనిషి జీవితానికి మానసిక ఆరోగ్యం ఎంత అవసరమో వివిధ రకాల రంగులతో తీర్చిదిద్దిన రంగవల్లికల ద్వారా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ హ్యూమనిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, మానసిక శాస్త్ర విభాగం విద్యార్థులు వినూత్నరీతిలో తెలియజెప్పారు. మానసిక ఆరోగ్య ప్రాధాన్యతను తెలియజెప్పడానికి గీతం విద్యార్థుల వినూత్న రంగోలి ప్రయత్నాన్ని ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతంరావు అభినందించారు.

ప్రాభవం కోల్పోతున్న శారదాపీఠం

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వంతోనే శారదాపీఠం ప్రాభవం కోల్పోయిందని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి రామ్ అన్నారు. శుక్రవారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ, శారదా పీఠానికి వైభవం తగ్గడానికి కారణం పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి అన్నారు. హిందువుగా చెప్పుకుంటున్న ఎస్ఎన్.పాల్ (స్వరూపానందేంద్ర సరస్వతి) రామతీర్థంలో శ్రీరామ విగ్రహం శిరచ్ఛేదనం సమయంలోనూ, తాజాగా తిరుమలలో లడ్డూ అపవిత్రతపై వార్తల నేపథ్యంలో కనీసం స్పందించలేదన్నారు.

ఇప్పటికే తాను శారదాపీఠం అక్రమాలపై, హిందూయిజం ముసుగులో అప్పటి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాల నుంచి భూములను పొందిన శారదాపీఠం అధిపతి వైనంపై రాష్ట్రపతికి ఫిర్యాదు చేశానన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి కూడా ఇదే అంశాన్ని తీసుకెళ్లానన్నారు. రాజకీయ వేదికగా మారిన శారదా పీఠంలో దసరా శరన్నవరాత్రులు ఉత్సవాలు జరుగుతున్నప్పటికీ, అక్కడికి ఎవరూ వెళ్లకపోవడం దాని ప్రాభవం మసకబారి పోతోందనడానికి నిదర్శనమన్నారు. సమావేశంలో డాక్టర్ పపూర్ నికుంజ్, కోరుకొండ శ్రీనివాసరావు, జి.విజయరమణి పాల్గొన్నారు.

నేడు దీపారాధన

ప్రజాశక్తి - ఆరిలోవ : చినగదిలి నార్త్ షిరిడి సాయిబాబా ఆలయంలో విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏటా మాదిరిగానే శనివారం 18వేల దీపాలతో 30వ వార్షిక దీపారాధన నిర్వహించడానికి ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసిందని కమిటీ చైర్మన్ వానపల్లి అప్పారావు తెలిపారు. శనివారం మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో మౌన ప్రార్థనలు, అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని, సాయంత్రం 6 గంటలకు దీపారాధన ఉంటుందన్నారు.జివిఎంసి అదనపు కమిషనర్ రేలంగి సోమనారాయణ దంపతులు పాల్గొని మొదటి దీపాన్ని ప్రజ్వలిస్తారని తెలిపారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - రంపచోడవరం : రాజమహేంద్రవరం రామకృష్ణ మిషన్, వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయ వారిచే రంపచోడవరం మండలం, సిరిగిందలపాడులోని రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆవరణలో ఈ నెల 13న ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనంద మహారాజ్ తెలిపారు. ఈ శిబిరంలో కంటి పరీక్షలు ఉచితంగా చేసి, అవసరమైన వారికి మందులు, కళ్ళ జోళ్లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కంటి ఆపరేషన్లు (కాటరాక్ట్) అవసరమైన వారికి వేమాగిరి పరమహంస యోగానంద నేత్రలయానికి తరలించనున్నట్లు తెలిపారు.

జిఎంపి కాలుష్యంతో ప్రజారోగ్యానికి ముప్పు

సీ ఫుడ్ కంపెనీ కాలుష్యంపై సిపిఎం ఆధ్వర్యంలో చిన్నయ్యపాలెం గ్రామస్తుల ధర్నా

ప్రజాశక్తి - ఆనందపురం: మండలంలోని బాకూరుపాలెం, కుసులువాడ పంచాయతీల మధ్య చిన్నయ్యపాలెం వద్ద ఉన్న ఘాన్ మెరైన్ ప్రోడక్ట్ (జిఎంపి) సీ ఫుడ్ కంపెనీ కాలుష్యంతో ప్రజలు అవస్థలు పడుతున్నారని, దీంతో ప్రజారోగ్యానికి ముప్పు ఉందని జివిఎంసిలో సిపిఎం ఫ్లోర్‌లీడర్, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు అన్నారు. శుక్రవారం కంపెనీ గేటు వద్ద సిపిఎం ఆధ్వర్యంలో చిన్నయ్యపాలెం గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. ముందుగా గ్రామం నుంచి నిరసన నినాదాలు చేస్తూ ర్యాలీగా బాకూరుపాలెం వద్ద నున్న కంపెనీకి చేరుకుని ధర్నా చేశారు.

ఈ సందర్భంగా గంగారావు మాట్లాడుతూ, జిఎంపి సీ ఫుడ్ కంపెనీ విడుదల చేసే వ్యర్థజలాలను కాలువల ద్వారా బయటకు వదిలేయడంతో చిన్నయపాలెం పరిసర ప్రాంతాలలో దుర్వాసనతో ప్రబలి, దోమలు వృద్ధి చెందడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాలువల్లోకి వదిలేసిన నీటిని పశువులు, ఇతర మూగజీవాలు తాగుతూ రోగాల బారిన పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యర్థజలాలను బయటకు వదిలేయకుండా సీఫుడ్ కంపెనీలోని ఫిల్టర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. లేకుంటే పెద్దఎత్తున ఆందోళన తప్పదని హెచ్చరించారు.

సిపిఎం జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ, సముద్ర తీరంలో పెట్టుకోవాల్సిన సీ ఫుడ్ కంపెనీలను ఇలా మైదానప్రాంత గ్రామాల మధ్య, పర్యావరణానికి హాని కలిగించే విధంగా పెట్టడం సరికాదన్నారు. ఇటువంటి వాటికి అనుమతులివ్వొద్దని కోరారు.

చిన్నయ్యపాలెం గ్రామస్తుల ఆందోళనతో కంపెనీ ఎండీ కృష్ణారావు ఆందోళనకారుల వద్దకు వచ్చి, కాలుష్యం రాకుండా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

అనంతరం పలు సమస్యలతో ఎండీ కృష్ణారావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు రవ్వ నర్సింగరావు, చిన్నయ్యపాలెం గ్రామస్తులు భీమరాజు, నూకరత్నం, కొప్పల దాలప్పు, కదరాశి అర్జున, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు



కంపెనీ గేటు వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న బాధితులు



సీ ఫుడ్ కంపెనీ ఎండీకి వినతిపత్రం ఇస్తున్న చిన్నయ్యపాలెంవాసులు

కూచిపూడి నృత్యంలో రాణిస్తున్న మౌక్తిక

తాజాగా షార్జాలో తెలుగువారి మన్ననలు పొందిన చిన్నారి నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి- విశాఖపట్నం : ఏడేళ్ల చిరుప్రాయంలోనే దేశవిదేశాల్లో సంప్రదాయ కూచిపూడి నృత్యప్రదర్శనలిస్తూ పలువురి ప్రశంసలు, అభినందనలు అందుకుంటోంది విశాఖకు చెందిన చిన్నారి కళాకారిణి మౌక్తిక. తాజాగా దుబాయ్ షార్జాలో తన నృత్య ప్రదర్శనతో అక్కడివారికి కట్టిపడేసంది. గతంలో మలేషియా లోనూ తన నాట్యప్రదర్శనతో అక్కడ తెలుగువారిని మంత్రముగ్ధులను చేసింది. పిట్ట కొంచెం కూత ఘనం అనే నానుడికి నిలువెత్తు నిదర్శనంగా కూచిపూడి నృత్యప్రదర్శనలతో రాణిస్తూ పలువురి ప్రశంసలు అందుకుంటోంది. వివరాల్లోకి వెళితే..

విశాఖనగరానికి చెందిన బి.యోగి, సౌజన్యల కుమార్తె చిన్నారి మౌక్తిక సంప్రదాయ నృత్యంలో రాణిస్తోంది. విశాఖ వ్యాలీ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న మౌక్తిక కూచిపూడి నృత్యంలో ఇప్పటికే పలు ప్రదర్శనలు ఇచ్చింది. తాజాగా దుబాయ్ షార్జాలో నాట్యఘరి అనే సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో దేశం తరుపున పాల్గొని, తన నృత్య ప్రదర్శనతో అందరినీ అలరించింది. నిర్వాహకులతోపాటు పలువురి ప్రశంసలు, మన్ననలు అందుకుంది. భవిష్యత్తులో సాంప్రదాయ నృత్యంలో మరింత రాణించి, భారత కీర్తిప్రతిష్టలను ఇనుమడింప జేయాలని పలువురు ఆకాంక్షించారు,



మౌక్తిక

శిల్పారామం జాతరలో ఆకట్టుకున్న నృత్యాలు



నృత్య ప్రదర్శనలో కళాకారులు

ప్రజాశక్తి -మధురవాడ : దసరా ఉత్సవాల్లో భాగంగా శిల్పారామం జాతరలో శుక్రవారం నిర్వ హించిన ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. విశాఖపట్నం జోష్ డాన్స్ అకాడమీ కళాకారుల శాస్త్రీయ, జానపద నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ముందుగా వక్రతుండ మహాకాయ, హరిగిరి నందిని, ప్రణవాలయ స్వామి, రామరామ, కొండలలో నెలకొన్న, వేపచెట్టు ఉయ్యాల, నోమి నోమన్నలాలో వంటి గేయాలకు మోహనలక్ష్మి, ఆశాలత, సాయి, చిన్మయి, తోషిత, గోపిక, బాల బస్మిక, యశస్వి, మోనికలు చేసిన నృత్యాలు ప్రేక్షకులను తన్మయులను చేశాయి. కార్యక్రమాన్ని శిల్పారామం జాతర పరిపాలనాధికారి బి. విశ్వనాధరెడ్డి పర్యవేక్షించారు.

పౌర గ్రంథాలయ సేవలను వినియోగించుకోండి

ప్రజాశక్తి- సీతమ్మధార : పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే నిరుద్యోగులు, విద్యార్థులు చదువుకోడానికి ఎంతో అనుకూలంగా ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయం ఉందని ప్రిన్సిపల్ కమిషనర్ కస్టమ్స్ ఎన్.సురేంద్ర అన్నారు. శుక్రవారం పౌర గ్రంథాలయాన్ని సందర్శించారు. గ్రంథాలయంలోని వివిధ విభాగాలను గురించి, గ్రంథాలయ కార్యదర్శి డిఎస్ వర్మ వివరించారు. ఈ సందర్భంగా ఎన్ సురేంద్ర మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులు, యువతకు పౌరగ్రంథాలయం అనువైన వేదికలా ఉందని, ప్రశాంత వాతావరణంతోపాటు అవసరమైన సౌకర్యాలన్నీ అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని అనుకున్న లక్ష్యాలను, విజయాలని సాధించాలని సూచించారు. నిరుద్యోగయువత, విద్యార్థులకు అనుగుణంగా వైఫై కనెక్షన్ అందుబాటులో ఉంచాలని గ్రంధాలయ సిబ్బందికి సూచించారు. యువత క్రమశిక్షణతో అభ్యసిస్తే తప్పకుండా ఉన్నత శిఖరాలకు చేరవచ్చని సూచించారు.కార్యక్రమంలో శ్రావణి షిప్పింగ్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ ఎన్.సాంబశివరావు గ్రంథాలయ వైస్ ప్రెసిడెంట్ టిఎస్ఆర్ ప్రసాద్, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



గ్రంథాలయ సందర్శనలో కస్టమ్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్ర

ఉత్సాహంగా కోలాటం పోటీలు



జూనియర్స్ విభాగంలో విజేత కుమ్మరిపాలెం బృందం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గంటా నారాయణమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం మండలస్థాయి కోలాటం పోటీలు నిర్వహించారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో 18 జట్లు పాల్గొన్నాయి. సీనియర్ విభాగంలో చిప్పాడ, శ్రీ సుత్తమ్మ తల్లి కోలాటం జట్టు, జూనియర్ విభాగంలో యాత కుమ్మరిపాలెం సరస్వతి కోలాటం జట్టు విజేతలుగా నిలిచాయి. న్యాయనిర్ణేతలుగా తహశీల్దార్ పి.రామారావు, జివిఎంసి ఒకటో జోన్ కమిషనర్ పిల్లి ప్రేమ ప్రసన్నవాణి, చిట్టివలస జెడ్‌పి బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం పొట్నూరు మురళీ మోహనరావు వ్యవహరించారు. మండలస్థాయి పోటీల్లో విజేతలైన వీరు ఈ నెల 12న భీమిలిలో జరుగు నియోజకవర్గ స్థాయి కోలాటం పోటీల్లో పాల్గొంటారన్నారు.

కార్పొరేటర్ సురేష్‌పై రౌడీషీట్ అన్యాయం

ప్రజాశక్తి- ములగాడ: సొంత నిధులతో నిరంతరం స్వచ్ఛంద సేవా కార్యక్రమాలతో ప్రజలకు చేరువలో ఉండే జివిఎంసి 60వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ పివి.సురేష్‌పై రౌడీషీట్ తెరవడం దుర్మార్గమని పారిశ్రామిక ప్రాంత ప్రజలతో పాటు పలు స్వచ్ఛంద సేవా సంస్థలు, పారిశ్రామిక వేత్తలు, మేధావులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సురేష్‌పై నాలుగు కేసులు ఉన్నాయని, అందుకే రౌడీషీట్ తెరిచామని చెబుతున్న అధికారులు, ఆ నాలుగింటిలో ఒక్క కేసులోనైనా సురేష్‌ను న్యాయస్థానం నిందితునిగా నిర్ధారించలేదని, అలాంటప్పుడు ఎలా రౌడీ షీట్ తెరుస్తారని ప్రశ్నిస్తున్నారు. రాజకీయ దురుద్దేశ్యంతో సురేష్‌పై నిరాధార కేసులు పెట్టి, అతని ఎదుగుదలను, ప్రతిష్టను దెబ్బతీయాలని చూడడం దుర్మార్గమని, సురేష్‌పై పెట్టిన రౌడీషీట్ ఎత్తేయాలని కోరుతున్నారు.

అనకాపల్లి - అచ్యుతాపురం మార్గంలో బస్సుల కొరత

- ఎస్ఇజెడ్ పరిశ్రమలొచ్చినా పెరగని ఆర్టీసీ సర్వీసులు
- తీవ్ర ఇబ్బంది పడుతున్న వేలాది మంది కార్మికులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

అనకాపల్లి- అచ్యుతాపురం మార్గంలో ఆర్టీసీ బస్సుల కొరత తీవ్రంగా ఉంది. ఎప్పుడు 20 ఏళ్ల క్రితం ఎన్ని బస్సులైతే నడిపేవారో, అచ్యుతాపురం ఏరియాలో ఎస్ఇజెడ్ పరిశ్రమల్లొచ్చి, కార్మికుల రాకపోకలు పెరిగినా అన్నే బస్సులను ఆర్టీసీ నడుపుతోంది. దీంతో కార్మికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

ప్రత్యేక ఆర్థిక మండలి (ఎస్ఇజెడ్)గా అచ్యుతాపురానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఉంది. సుమారు 60 వేల మంది కార్మికులు ఇక్కడి పరిశ్రమలలో పనిచేస్తున్నారు. ప్రతిరోజు జిల్లా నలుమూలల నుంచి అచ్యుతాపురం ఎస్ఈజెడ్ పరిశ్రమల్లో పనిచేయడానికి కార్మికులు రాకపోకలు సాగిస్తున్నారు. కొన్ని పరిశ్రమలు తమ కార్మికుల రాకపోకలకు సొంతంగా బస్సులు నడుపుతున్నాయి. అయితే అనేక పరిశ్రమలు బస్సులు నడపకపోవడంతో వేలాదిమంది కార్మికులు ఆటోలు, ద్విచక్ర వాహనాలు, ప్రైవేట్ వాహనాల ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు. అచ్యుతాపురానికి దూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే వారి సంఖ్య పెరిగింది. ఇందుకు అనుగుణంగా ఏపీఎస్ ఆర్టీసీ సంస్థ అదనపు బస్సు సర్వీసులను వేయడం లేదు.



20 సంవత్సరాల క్రితం తిరిగే బస్సులనే ఆర్టీసీ సంస్థ ఇప్పటికీ అవే పేర్లతో, అన్నే బస్సులను తిప్పుతోంది. పూడిమడక, తంతడి, వైలోవ, కొత్తపట్నం, రాంబిల్లి పేర్లతో నడిపే బస్సులే అప్పుడు, ఇప్పుడు నడుస్తున్నాయి. 20 సంవత్సరాల క్రితం అచ్యుతాపురానికి రాకపోకలు సాగించే ప్రయాణికుల సంఖ్యతో పోల్చితే నేడు ప్రయాణించే వారి సంఖ్య అనేక రెట్లు పెరిగింది. అయినా పెరిగిన ప్రయాణికుల సంఖ్యను ఆర్టీసీ పట్టించుకోలేదు. ప్రయాణికులు పడుతున్న కష్టాలను ఆర్టీసీ అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు కూడా గాలికి వదిలేశారు. అచ్యుతాపురంలో ఆర్టీసీ డిపో పెట్టాలని, 20 గ్రామాలు ఉన్న ఎస్ఈజెడ్ దిబ్బపాలెం కాలనీకి ప్రత్యేకమైన బస్సు తిప్పాలని అప్పుడప్పుడు ప్రకటనలు చేయడం, హడావుడిగా చేస్తున్నారే తప్పా ఆ దిశగా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. అధికారులు వచ్చి ఒకసారి డిపోకి కావలసిన స్థలాలను పరిశీలించి ఏమీ పట్టనట్టు వదిలేశారు. దీంతో ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

అచ్యుతాపురం నుంచి అనకాపల్లి రాకపోకలకు నిర్ణీతమైన సమయాలలో ఏ బస్సు ఎప్పుడు వస్తుందో ప్రయాణికులకు తెలియని పరిస్థితి నెలకొంది. అనకాపల్లి నుంచి అచ్యుతాపురం రావాలంటే రాత్రి 8 అయితే బస్సులు జాడ కానరాదు. ఆటోలపై వద్దామంటే అప్పుడు ఛార్జీలు వేరేగా ఉంటున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పెరిగిన ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా అచ్యుతాపురానికి బస్సులు నడపాలని, అచ్యుతాపురంలో ఆర్టీసీ డిపో ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

కోస మెరుపు : గాజువాక, కూర్మన్నపాలెం డిపోల నుంచి విశాఖ స్టీల్‌ప్లాంట్, పరవాడ మీదుగా ఎలమంచిలికి నేరుగా బస్సులు తిరుగుతున్నాయి. ఈ బస్సులు ఆ మార్గంలో రాకపోకలు సాగించే వారికి కొంత ఊరటగా ఉన్నాయి. అయితే ఆ బస్సులలో రద్దీ ఎక్కువగానే ఉంటుంది.



మంత్రి లోకేష్‌తో పీలా గోవింద, తాతయ్యబాబు, పల్లా శ్రీనివాస్

లోకేష్‌ను కలిసిన పీలా, బత్తుల

ప్రజాశక్తి-అనకాపల్లి, బుచ్చయ్యపేట

రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన టీడీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్య బాబు శుక్రవారం గుంటూరులో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమకు అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కొద్దిసేపు నియోజకవర్గంలోని అంశాలపై మాట్లాడారు. త్వరలో ప్రారంభం కానున్న పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని మంత్రి లోకేష్ సూచించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి- మునగపాక : విజయదశమి సందర్భంగా ఈ నెల 12న శనివారం మధ్యాహ్నం రెండు గంటల నుండి స్థానిక నందీశ్వర కళా ప్రాంగణం ఆవరణలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు గ్రామానికి చెందిన పెంటకోట శ్రీకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. తమ పెద్ద తండ్రి కీర్తిశేషులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత పెంటకోట సత్యనారాయణ, తన తండ్రి పట్టాభి రామ్ నాయుడు (గాంధీ) జ్ఞాపకార్థం ఈ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా చిన్న పిల్లలకు రంగులరాట్నం, జంపింగ్ వంటి కార్యక్రమాలతో పాటు తప్పిడి గుళ్ళు, కోలాటం వంటి వివిధ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అదే రోజు సాయంత్రం ఏడు గంటలకు భారీ బాణాసంచా కార్యక్రమం కూడా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.

కనకదుర్గ జాతరకు విస్తృత ఏర్పాట్లు

ప్రజాశక్తి-అనకాపల్లి : దసరా పండగ సందర్భంగా అనకాపల్లి గవరపాలెం శతకం పట్టు వద్ద కనకదుర్గమ్మ అమ్మవారి జాతర శనివారం ఘనంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఉత్సవం సందర్భంగా భారీ ఎత్తున పట్టణంలో విద్యుత్ దీపాలతో అలంకరించారు. రోడ్లన్నీ సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. శతకం పట్టు నుండి రింగ్ రోడ్డు వరకు విద్యుత్ దీపాలను, భారీ స్టేజి ప్రోగ్రాములు నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. జీవీఎంసీ సిబ్బంది సహకారంతో రోడ్లన్నీ శుభ్రం చేశారు. సుమారు. సుమారు 10 స్టేజి ప్రోగ్రాములను ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున నవ దుర్గల ఊరేగింపు, ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి గవరపాలెం వరకు నిర్వహిస్తారు. మంగళ వాయిద్యాలు, మేళ తాళాలు, పెద్ద ఎత్తున నేల డ్యాన్సులు, జానపద నృత్యాలు పట్టణవాసులను అలరించనున్నాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు సిబ్బందితో చర్యలు తీసుకున్నారు. ఉత్సవాన్ని తిలకించేందుకు సుమారు లక్ష మంది జనం వస్తారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. అందుకు అవసరమైన చర్యలు తీసుకున్నారు. ఉత్సవ నిర్వాహకులు ఆలయ వ్యవస్థాపకులు పీవి రమణ, కాండ్రేగుల నాయుడు, ఆలయ చైర్మన్ బీమరశెట్టి వరహా నూకరాజు ఆధ్వర్యాన ఏర్పాట్లు పూర్తయ్యాయి.

టిడిపి కూటమి పాలనలో అభివృద్ధి

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్రంలో నాలుగు నెలల కూటమి పాలన అభివృద్ధి వైపు పయనిస్తుందని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రాన్ని గతంలో విడిచిపెట్టి పోయిన పారిశ్రామికవేత్తలు తిరిగి రప్పించడానికి చంద్రబాబు లోకేష్ శక్తి యుక్తులను వినియోగించి పారిశ్రామికవేత్తలతో సమీక్ష సమావేశాలు పెట్టి వారికి భరోసా కల్పిస్తున్నారని పేర్కొన్నారు. జగన్మోహన్‌రెడ్డి నాడు 14 లక్షల కోట్లు అప్పులు తెచ్చి ప్రజలకు తిప్పులు చూపించారని, కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ ఉండడంవల్ల వారి సహకారంతో రాష్ట్రానికి నిధులు, పరిశ్రమలు రావడానికి సహకారం అందిస్తున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం రానున్న కాలంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ఒక ఉన్నత స్థానంలో నిలబెడుతుందని తెలిపారు.

చట్ట ప్రకారం కార్మికులకు బోనస్ చెల్లించాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రాము డిమాండ్

ప్రజాశక్తి-అచ్యుతాపురం

పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికులకు చట్ట ప్రకారం బోనస్ చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము డిమాండ్ చేశారు. అచ్యుతాపురం బ్రాండిక్స్ అదిస్తాన్ ఆవరణలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఎక్స్‌పోక్ యాజమాన్యం కార్మికులకు తక్కువగా బోనస్ చెల్లించిందని, ఆ పరిశ్రమ యాజమాన్యంపై కార్మికశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బ్రాండిక్స్ పరిశ్రమంలో పనిచేస్తున్న అన్ని కేటగిరీలు కాంట్రాక్ట్, క్యాజువల్, పర్మినెంట్ కార్మికులకు చట్ట ప్రకారం బోనస్ చెల్లించాలని కోరారు. ఎస్ఈజెడ్ ఫార్మా పరిశ్రమలలో చట్ట ప్రకారం ఇవ్వాల్సిన బోనస్ అమలు చేయడం లేదన్నారు. సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని విచారణ జరిపి కార్మికులకు బోనస్ విషయంలో చట్ట ప్రకారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బోనస్ డిమాండ్ చేస్తున్న కార్మికులపై ఎటువంటి వేధింపులు లేకుండా పారిశ్రామిక శాంతిని నెలకొల్పాలని ఆయన కోరారు.



మాట్లాడుతున్న సిఐటియు నేత రాము



పెద్ద పెద్ద గోతులతో ఉన్న తీడ రోడ్డు

తీడ రోడ్డును బాగు చేయరూ..

ప్రజాశక్తి- కశింకోట

కశింకోట మండలం కన్నూరుపాలెం- తీడ రోడ్డును బాగు చేయాలని తీడ, కచ్చర్లపాలెం, చెరకాము, మేడిశెట్టిపాలెం గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ రోడ్డు మార్గంలో పై గ్రామాలతో పాటు రావికమతం, మాకవరపాలెం మండలాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తూ ఉంటారు. వర్షం పడితే గొయ్యిలో పడి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా ఈ రోడ్డు గోతులు పూడ్చాలని, శాశ్వత తారు రోడ్డు నిర్మాణం చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అచ్యుతాపురం సంతకు దసరా శోభ



సంతలో విక్రయానికి పెద్ద మొత్తంలో వచ్చిన పొట్టేళ్లు, మేకలు

ప్రజాశక్తి అచ్యుతాపురం

అచ్యుతాపురం వారపు సంతలో దసరా పండగ కళ కనిపించింది. అచ్యుతాపురం, వెంకయ్యపేట ప్రాంతాలకు శుక్రవారం తెల్లవారి నుంచి కొనుగోలుదారులు విక్రయదారులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చారు. దసరా సందర్భంగా గత వారం వలె నాటుకోళ్ళు, పొట్టేళ్లు, మేకలు కొనుగోలు చేయడానికి జిల్లా నలుమూలల నుంచి భారీగా వచ్చారు. నాటుకోళ్ళు, పొట్టేళ్ళు, మేకల పెంపకం దారులు పెద్ద మొత్తంలో వాటిని తీసుకొచ్చారు. అలాగే వాహనాలకు కట్టడానికి నిమ్మకాయలు, పూలదండలు, నల్ల జీడిపిక్కలు, పువ్వులు, కొబ్బరికాయలు, పండ్లు అత్యధిక సంఖ్యలో అమ్ముడయ్యాయి. కూరగాయలు, ఆకుకూరలు, దుంపలు, ఉల్లిపాయలు, టమోటాలు వంటి వాటికి ధరలు పెరిగాయి. దసరా పండగ సందర్భంగా ధరల పెరగడంతో వినియోగదారులకు భారంగా మారాయి. పప్పులు, ఉప్పులు నూనె తదితర నిత్యావసర సరకులు అధిక రేట్లు పెంచి విక్రయించారు. మిఠాయి షాపులు బిజీగా కనిపించాయి. ఎస్ఈజెడ్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు బోనస్ అందడంతో పలు రకాలైన గృహ అలంకరణ వస్తువులు తదితర వాటిని కొనుగోలు చేశారు.



విక్రయానికి సిద్ధం ఉన్న కొబ్బరికాయలు



తాతయ్యబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న గుర్రం నూకరాజు

తాతయ్యబాబుకు నూకరాజు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : ఎపి గృహ నిర్మాణ సంస్థ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన టిడిపి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబును మండలంలోని ఉప్పారగూడెం గ్రామానికి చెందిన టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుర్రం నూకరాజు శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే గృహ నిర్మాణశాఖ మంత్రి పార్థసారథిని చోడవరం శాసనసభ్యులు కెఎస్ఎన్ఎస్.రాజు సమక్షంలో కలిసినట్లు చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ యూనియన్ నాయకులు, టిడిపి బీసీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, జోన్ వన్ బిసి విభాగం కోఆర్డినేటర్ పూతికోటేశ్వరావు పాల్గొన్నారు.

రూ.6.6 కోట్లతో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని పలు గ్రామాల్లో 6.6 కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి పనులను మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఈ నెల 14, 18 తేదీల్లో ప్రారంభిస్తారని ఎంపీడీవో సాంబశివరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఈనెల 14, 18 తేదీల్లో గ్రామాల ఆయన పర్యటిస్తారని పేర్కొన్నారు. 14న సింగన్నదొరపాలెం, కేజే పురం, ఏ కోడూరు, రామయోగిఅగ్రహారం, పోతనవలస, కొరువాడ గ్రామాల్లోనూ, 18న పైడంపేట రొంగలినాయుడుపాలెం, గొండుపాలెం, చౌడువాడ గ్రామాల్లోనూ కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో 49 అభివృద్ధి పనులను చేపడతారని, సిసి రోడ్లు, డ్రైన్లు నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని తెలిపారు.

వీధి కుక్కల దాడిలో 9 మందికి గాయాలు

ప్రజాశక్తి-కె.కోటపాడు : గ్రామాల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. మండలంలోని ఆర్‌వై అగ్రహారంలో వీధజ కుక్కలు 9 మందిపై దాడి చేయడంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. ఏడేళ్ల బాబు ముఖంపై గాయపరచగా హుటాహుటిన కొత్తవలస ఆసుపత్రికి తరలించారు. మిగిలిన వారందరూ కే కోటపాడు సిహెచ్‌సిలో వైద్య చికిత్సలు పొందుతున్నారు. ఇదే గ్రామంలో ఇటీవల పశువులపై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన విషయం విధితమే. అలాగే నాలుగు రోజుల క్రితం చౌడువాడలో నలుగురు మహిళలపై వీధి కుక్కలు దాడి చేయడంతో వారంతా ఆసుపత్రి పాలయ్యారు. ఎక్కువగా చిన్నపిల్లలు, మహిళలు ఒంటరిగా వెళ్లే సమయంలో కుక్కలు దాడులకు దిగుతున్నాయి. తక్షణమే పంచాయతీ అధికారులు కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పాడి రైతులకు దసరా కానుకల పంపిణీ

ప్రజాశక్తి- సబ్బవరం : మండల కేంద్రం సబ్బవరం మేజర్ పంచాయితీ పాల సొసైటీలో పాడి రైతులకు పాల సొసైటీ అధ్యక్షులు సబ్బవరపు సత్యనారాయణ (బుజ్జి) తన సొంత నిధులతో దసరా కానుకలు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సబ్బవరం పాల సొసైటీ పరిధిలో పెద నాయుడుపాలెం, చిన గొల్లలపాలెం, సబ్బవరం గ్రామాలకు చెందిన సుమారు 150 మంది పాడి రైతులకు చికెన్, మినప పప్పు, పంచదార అరకిలో చొప్పున, మటన్, చికెన్ మసాలా ప్యాకెట్‌లు పంపిణీ చేశారు. పాడి రైతు బోకం ఎర్రునాయుడు మరణించగా అయన కుటుంబానికి రూ.30వేలు బీమా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు బోకం శ్రీరామమూర్తి, సత్యనారాయణ, పోతల అప్పారావు, సబ్బవరపు పరదేశీ, స్వామినాయుడు, అప్పల నాయుడు, కె.అనిత, జి.శ్రీరాములమ్మ, ఎస్.గంగతల్లి, రైతులు పాల్గొన్నారు.



బీమా చెక్కు అందిస్తున్న పాల సొసైటీ అధ్యక్షులు బుజ్జి

మాజీ మంత్రి గురునాథరావుకు ఘన నివాళి

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్

రాజకీయాల్లో మాజీ మంత్రి గుడివాడ గురునాథరావు సేవలు అమోఘమని ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ అన్నారు. శుక్రవారం కీర్తిశేషులు గుడివాడ గురునాథరావు 69వ జయంతి సందర్భంగా ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని ఆయన విగ్రహం వద్ద వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమం జరిగింది. ముందుగా బొత్స సత్యనారాయణ గురునాథరావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, శాసన మండలి సభ్యులు కుంభా రవిబాబు, వరుదు కల్యాణి, మాజీ శాసన సభ్యులు తైనాల విజయ్ కుమార్, తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్ కుమార్, చింతలపూడి వెంకటరామయ్య, తిప్పల గురుమూర్తి రెడ్డి, పార్టీ కార్యాలయ ఇన్‌ఛార్జ్ రవి రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు బాణాల శ్రీనివాసరావు, మొల్లి అప్పారావు, తిప్పల దేవన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గాజువాక : జివిఎంసి 68వ వార్డు మింధిలో మాజీ మంత్రి గుడివాడ గురునాథరావు జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గురునాథరావు విగ్రహానికి మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, చింతలపూడి వెంకటరామయ్య, వైసిపి నేతలు గుడివాడ అప్పల రామ్మూర్తి, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తనవద్దకు సాయం కోసం వచ్చిన వారిని ఆప్యాయంగా పలకరిస్తూ, వారు కోరిన పనిని చేసిపెట్టిన మహోన్నత వ్యక్తి గురునాథరావు అన్నారు. అందుకే నేటికీ అయనకు రెండు తెలుగు రాష్ట్రాలలో అభిమానులు ఉన్నారన్నారు. ఈ సందర్భంగా పేదలకు 300 దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి కార్పొరేటర్లు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

కశింకోట : మాజీ మంత్రి, కీర్తిశేషులు గుడివాడ గురునాథరావు 69వ జయంతి వేడుకలు కశింకోట ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వైసిపి అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్, వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ గుడివాడ గురునాథరావు విగ్రహానికి వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భరత్ కుమార్ మాట్లాడుతూ గుడివాడ గురునాథరావు ప్రజల మనిషి అని, ప్రజా నాయకునిగా సుస్థిర స్థానం సంపాధించుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కలగా గున్నయ్య నాయడు, మలసాల కిషోర్, గొల్లవిల్లి శ్రీనివాసరావు, పెంటకోట శ్రీను, మలసాల కుమార్ రాజా, చిన్ని వల్లభ నారాయణరావు, హనుమంతు వెంకట లక్ష్మణరావు, కొట్టి రాము, ఒమ్మి గంగునాయుడు పాల్గొన్నారు.

అనకాపల్లి : మాజీ మంత్రి గుడివాడ గురునాథరావు 69వ జయంతి వేడుకలు సందర్భంగా శుక్రవారం స్థానిక రింగ్ రోడ్‌లోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణుల మధ్య కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురునాథరావు ఆశయ సాధనకు అందరూ పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో 81వ వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మీ సౌజన్య, వైసిపి నాయకులు దంతులూరి దిలీప్ కుమార్, కెయం నాయుడు, మలసాల కిషోర్, కలగా గున్నయ్య నాయుడు, పెద్దిశెట్టి గోవింద్, దాడి నారాయణరావు, బుద్ధ రాజు, పెంటకోట జ్యోతి శ్రీను, మలసాల కుమార్ రాజా, పెంటకోట శ్రీను, ఉగ్గిన అప్పారావు, కాండ్రేగుల రాము, పల్లెల సాయి కిరణ్, కాండ్రేగుల శ్యామ్, రాజు, సత్తిబాబు, సకల సంతోష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



గురునాథరావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న బొత్స, అమర్‌నాథ్ తదితరులు

కూలగొట్టిన కూరగాయల మార్కెట్ కలప ఏమైంది?

పబ్లిక్ గ్రీవెన్స్‌లో మున్సిపల్ కమిషనర్‌కు టిడిపి నేత రమణబాబు ఫిర్యాదు

ప్రజాశక్తి - యలమంచిలి

యలమంచిలి కూలగాయల మార్కెట్ కూల్చేసిన కలప ఏమైందని తెలుగుదేశం పట్టణ కార్యదర్శి ఎవి.రమణబాబు శుక్రవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. స్థానిక కూరగాయల మార్కెట్‌ను అభివృద్ధి పనుల పేరిట 2020లో కిరాతంగా కూల్చేశారని తెలిపారు. కూల్చిన మున్సిపల్ కమిషనర్‌కు వ్యతిరేకంగా కోర్టు తీర్పు రావడంతో కమిషనర్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసిందని పేర్కొన్నారు. కూరగాయల మార్కెట్లో విలువైన కలప మాయం వెనుక ఎవరి హస్తముందన్న విషయం ఇప్పటికీ తేలియలేదన్నారు. మార్కెట్ కూల్చివేత అనంతరం వచ్చిన కమిషనర్ కృష్ణవేణి ఆ కలపను 2022 సెప్టెంబర్ 19న వేలం వేస్తున్నట్లు ప్రకటన జారీ చేశారని, రూ.5,000 సర్కారు పాటగా వేలం వేయగా పాటదారులెవరూ ముందుకు రాకపోవడంతో వాయిదా వేస్తూ కలపను భద్రపరచినట్లు తెలిపారు. ఇంత వరకూ దానిపై ఎవరూ స్పందించలేదని, పలుమార్లు మున్సిపల్ అధికార్లను ప్రశ్నించినా బాధ్యతగా ఎవరూ సమాధానం చెప్పలేదని రమణమూర్తి పేర్కొన్నారు. దీంతో ఈ నెల 7న కొత్త కమిషనర్ ప్రసాదురాజుకు ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇదే విషయమై కమిషనర్ ప్రసాదరాజును వివరణ కోరగా దానికి సంబంధించిన అధికారి వివరణ కోసం పంపడం జరిగిందని, ఆ వివరణ అనంతరం రాతమూలంగా జవాబు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

రోడ్ల మరమ్మతులకు రూ.63 లక్షలు మంజూరు

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి నియోజకవర్గంలోని రోడ్లు మరమ్మతులకు స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ రూ.63 లక్షలు మంజూరు చేసినట్లు టిడిపి కూటమి మండల నాయకులు పేర్కొన్నారు. స్థానిక జనసేన ప్రధాన కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ వర్షాలతో బాగా శిథిలమైన స్టేట్ హైవే, నర్సీపట్నం-తాళ్లపాలెం రోడ్డు అర్జంట్ రిపేర్లకు రూ.10లక్షలు, చోడవరం-అనకాపల్లి రోడ్డు చినబాబు కాలనీ వద్ద ప్యాచ్ వర్క్‌కు రూ.10 లక్షలు, మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్లు రేబాక-కొండకొప్పాక రోడ్డు అర్జెంటు రిపేర్లకు రూ.10 లక్షలు, తోటాడ- అనకాపల్లి రోడ్డుకు రూ.9లక్షలు, తుమ్మపాల (కేబి) రోడ్డు నుండి వెంకుపాలెం, తగరంపూడిరోడ్డుకు రూ.10 లక్షలు, మామిడిపాలెం- కొండుపాలెం రోడ్డుకు రూ.9లక్షలు, తుమ్మపాల గుండాల జంక్షన్ నుండి లక్ష్మీదేపేట వైపు వెళ్లే రోడ్డుకు రూ.5 లక్షలు, మొత్తం 63 లక్షల రూపాయలను రోడ్లను మెరుగుపరచాలని మంజూరు చేసినట్లు చెప్పారు. అలాగే రోడ్లు, డ్రైన్లు, రైతులకు మినీ గోకులాలు, గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్లు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నారని చెప్పారు. రాబోయే వేసవికాలం లోపల జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయిలు వేయించే పనులు చేస్తున్నట్లు తెలిపారు. టిడిపి కూటమి కార్యకర్తలకు కొణతాల ఎల్లప్పుడూ అండగా ఉంటున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తుమ్మపాల మాజీ సర్పంచ్ కర్రి బాబి, మాజీ జెడ్పిటిసి భరత్ బాబు, తుమ్మపాల ఎంపిటీసీ చదరం నాగేశ్వరరావు, కూటమి నాయకులు తలారి కాశి నాయుడు, బంటు రవి, బత్తుల రమేష్, గంగుపాము జగదీష్, పచ్చికూర రాము, కప్పిరి తాతారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కూటమి నాయకులు

దుర్గాదేవిని దర్శించుకున్న నాయకులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

మండలంలోని హరిపాలెం గ్రామంలో దుర్గాదేవి ఉత్సవాల్లో ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ శుక్రవారం ఉదయం పూజలు చేశారు. మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. తిమ్మరాజుపేటలో దుర్గాంబిక ఆలయ ఆవరణలో మహిళలు, భవాని భక్తులు ఘటాలతో ఊరేగింపు చేశారు. మోసయ్యపేటలో భవాని భక్తులు ర్యాలీ చేశారు.

దేవరాపల్లి : మండలంలోని ఏ.కొత్తపల్లిలో చెంచయ్యగారి యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న దుర్గాదేవి పూజల్లో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, మాజీ సర్పంచ్ పెద్దాడ వెంకటరమణ, జనసేన నాయకుడు గొర్రెపోటు రామ్మూర్తి నాయుడు పాల్గొన్నారు.

అనకాపల్లి : వైసిపి అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ శుక్రవారం విజయదశమి సందర్భంగా జీవీఎంసీ 80, 81 వార్డులలో శివశక్తి ఫ్రెండ్స్, శతకం పట్టు, బాయ్ గూడెం, దాసరిగడ్డ, అరుంధతి నగర్, నూకాలమ్మ తల్లి గుడి తదితర చోట్ల దుర్గాదేవి అమ్మవారి మండపాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుచోట్ల భారీ అన్న సమారాధన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు దంతులూరి దిలీప్ కుమార్, 81వ వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మీ సౌజన్య, 80వ వార్డు వైసిపి ఇంచార్జ్ కె యం నాయుడు ఇతర నాయకులు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం రామాలయం వద్ద దుర్గాదేవి మండపంలో దుర్గాదేవి అమ్మవారిని పలు పార్టీ నాయకులు దర్శించుకున్నారు. శ్రీరామ పవర్ యూత్ ఆధ్వర్యంలో అన్నసంతర్పణ కార్యక్రమం జరిగింది.



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

వారపు సంతకు దసరా కళ

- జోరుగా గొర్రెలు, మేకల విక్రయాలు -అధిక కూరగాయల ధరలతో జనం గగ్గోలు

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లి వారపు సంతకు దసరా కళ ఉట్టి పడింది. మండల కేంద్రంలో ప్రతి శుక్రవారం వారపు సంత జరుగుతుంది. వ్యాపారులు అన్ని రకాల కూరగాయలతో పాటు, ఫ్రూట్స్, పూల మొక్కలు, ఇతర వ్యాపారాలు సాగిస్తుంటారు. ఎండి చేపల విక్రయాలు ప్రత్యేకం. శనివారం దసరా సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో జనం తరలివచ్చి వారికి నచ్చిన కూరగాయలు, ఫ్రూట్స్, పూల మొక్కలను కొనుగోలు చేసుకుని తీసుకువెళ్లారు. మార్కెట్‌లో కూరగాయల ధరలు మండిపోవడంతో జనం గగ్గోలు పెట్టారు. ఏ కూరగాయలు కొనాలన్నా కిలో రూ. 60లు పై మాటే ఉండడంతో కూరగాయలు కొనుగోలు చేసేందుకు సాహసించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కూరగాయల ధరలు అధికంగా ఉన్నప్పటికీ పండుగ సందర్భంగా తప్పనిసరి పరిస్థితుల్లో అరకొరగా కూరగాయలను కొనుగోలు చేసుకుని తీసుకువెళ్లారు. ఐదారొందలు పెట్టి కూరగాయలు కొనుగోలు చేసినప్పటికీ వారం కూడా సరిపోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కొనుగోలుదారులతో రద్దీగా ఉన్న సంత



గొర్రెలు, మేకల విక్రయాలు చేపడుతున్న వ్యాపారులు

గొర్రెలు,మేకలకు డిమాండ్ అరకోటికి పైగా వ్యాపారం

నక్కపల్లి వారపు సంతలో గొర్రెలు, మేకల విక్రయాలు జోరుగా సాగాయి. ప్రతి శుక్రవారం మండల కేంద్రంలో వారపు సంత జరుగుతుంది.దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వారపు సంతలో దసరా కళ ఉట్టిపడింది. నక్కపల్లి మండలంలో పలు గ్రామాల్లో ఉన్న గొర్రెలు, మేకల వ్యాపారులతో పాటు ఇతర ప్రాంతాలైన అచ్యుతాపురం, నర్సీపట్నం, కేడీపేట, కత్తిపూడి, ఎలమంచిలి, తాళ్లపాలెం తదితర ప్రాంతాల నుండి వ్యాపారులు గొర్రెలు, మేకలను ప్రత్యేక వాహనాల్లో తీసుకొచ్చి వ్యాపారాలు సాగించారు. అమ్మవారికి మొక్కులు చెల్లించేందుకుగాను మేకలు, గొర్రెపోతులను కొనుగోలు చేసేందుకు కొనుగోలుదారులతోపాటు మాంసం విక్రయాలు చేపట్టే వ్యాపారులు కూడా పెద్ద సంఖ్యలో తరలి రావడంతో మార్కెట్ ఆవరణం కిక్కిరిసింది. అందరూ ఒకేసారి గొర్రెలు, మేకలను కొనుగోలు చేయడానికి రావడంతో గొర్రెలు, మేకలకు గిరాకీ నెలకొంది. ఇదే అదునుగా భావించిన వ్యాపారులు అధిక ధరలకు గొర్రెలు, మేకలను విక్రయించారు. గొర్రెలు, మేకల సైజులను బట్టి 10 వేల రూపాయల నుండి 35 వేల వరకు ధరలు పలికాయి. అధిక ధరలు ఉన్నప్పటికీ చేసేదేమీ లేకపోవడంతో వాటిని కొనుగోలు చేసుకుని వాహనాల్లో తీసుకువెళ్లారు. గొర్రెలు, మేకల విక్రయాలు జోరందుకున్నాయి. సుమారుగా అరకోటికి పైగా వ్యాపారం సాగినట్లు తెలుస్తోంది.



నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

వైసిపి నేతలతో మాజీ ఎమ్మెల్యే గణేష్ సమావేశం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:స్థానిక క్యాంపు కార్యాలయంలో నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ శుక్రవారం మున్సిపాలిటీ వైసీపీ నాయకులతో ప్రత్యేక సమావేశమయ్యారు. ఈ సమావేశంలో భవిష్యత్‌లో నిర్వహించే పార్టీ కార్యక్రమాలపై చర్చించారు. నిత్యం ప్రజల్లో ఉండి వారి ఇబ్బందులను పరిష్కారమయ్యేలా చొరవ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, మున్సిపాలిటీ అధ్యక్షులు ఏకా శివ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి


ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని ఉపమాక పంచాయతీ సారిపల్లిపాలెం గ్రామానికి చెందిన మామిడి నూకరాజు (55) విశాఖపట్నం కెజిహెచ్ లో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్లు ఏఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. ఈనెల 3వ తేదీన మామిడి నూకరాజు బైక్ పై వస్తుండగా కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో నూకరాజు తీవ్రంగా గాయపడడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

చెక్కపై దుర్గాదేవి ప్రతిరూపం

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని చినదొడ్డుగల్లు గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు దార్ల రవి దసరా సందర్భంగా తన సూక్ష్మ కళ ను ప్రదర్శించాడు.దసరా సందర్భంగా చెక్కపై దుర్గాదేవి అమ్మవారి ఆకారం, త్రిశూలం చెక్కి తన ప్రతిభను ప్రదర్శించాడు.



దుర్గాదేవి



ఉత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

ఉపమాకలో మృగవేట ఉత్సవం

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి మృగవేట ఉత్సవం నిర్వహించారు. ఆలయంలో ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యులు ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం గోదాదేవి అమ్మవారి సన్నిధిలో లక్ష్మీ సహస్రనామ అష్టోత్తర శతనామ కుంకుమార్చనలు జరిపించారు. రాత్రి లంక వారి మండపం, బంధుర సరస్సు వద్ద మృగవేట ఉత్సవం నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని ఉత్సవమూర్తులను గజ వాహనంపై అధిష్టింపజేసి గ్రామ తిరు సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బురద గెడ్డ వద్ద ట్రాఫిక్ జామ్

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని అరకు సరిహద్దులో బురద గెడ్డ వంతెన వద్ద ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డు కోతకు కురవడంతో ప్రమాదకరంగా మారింది. రోడ్డుకు సుమారు సగభాగం రోడ్డు కోతకు గురై ఉన్న మరమ్మతు చేయడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చేస్తుండటంతో ఈ రోడ్డు నుండి ప్రయాణించే వాహనదారులు రవాణాకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దసరా పండగ కావడంతో శుక్రవారం అరకు వారపు సంతలో వివిధ వస్తువులు కొనుగోలు చేసుకునేందుకు గిరిజనులు తరలివచ్చారు. దీంతోపాటు టూరిస్టులు సైతం అరకు ప్రాంతంలో అధిక శాతం మంది వాహనాల్లో తరలివచ్చారు. బురద గెడ్డ వంతెన వద్ద రోడ్డు కోతకు గురయ్యింది. దీంతో, ఎండపల్లివలస నుంచి అరకు వరకు సుమారు రెండు కిలోమీటర్ల దూరం మేరకు వాహనాల రద్దీతో ట్రాఫిక్ జామ్ ఏర్పడటంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. ఈ విషయాన్ని తెలుసుకున్న అరకులోయ ఎస్సై గోపాల్‌రావు హుటాహుటిన బురద గెడ్డ వద్దకు చేరుకుని పోలీస్ సిబ్బందితో ఇరు పక్కల నిలిచిన వాహనాలను తరలించి ట్రాఫిక్ జామ్‌కు అంతరాయం ఏర్పడ కుండా చర్యలు తీసుకున్నారు. దీంతో, మళ్లీ యధావిధిగా వాహనాల రాకపోకలు సాగాయి. అరకు-పాడేరు జిల్లా కేంద్రానికి ప్రధాన రోడ్డు కావడంతో నిత్యం వాహనాల రాక పోకలతో రద్దీగా ఉంటుంది. అధికారులు రోడ్డును పూడ్చాలని వాహన దారులు కోరుతున్నారు.



బస్ కాంప్లెక్స్

ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో కానరాని సౌకర్యాలు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని ఏఎల్ పురం అల్లూరి సీతారామరాజు ఆర్టీసి బస్ కాంప్లెక్స్‌లో కనీస సౌకర్యాలకు నోచుకోలేదు. మరుగుదొడ్లు శుభ్రం చేసే పారిశుద్య కార్మికులకు జీతాలు లేక మూడు నెలల నుంచి పనులకు రాలేదు. తాగునీరు సౌకర్యం లేదు. కాంప్లెక్స్ ఆవరణలో పెద్ద పెద్ద గోతులు ఏర్పడటంతో వర్షం వస్తే చిత్తడిగా మారుతోంది. ఆర్టీసి అధికారులు మాత్రం షాపుల నుంచి లక్షల రూపాయల ఆదాయం పొందుతున్నారు. ఆర్టీసి కాంప్లెక్స్ ఆవరణలో 19 షాపులు టెండర్లకి లీజు ఇచ్చి తద్వారా వచ్చే ఆదాయంతో ప్రయాణికులు సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. దీనిపై ప్రజాప్రతినిధులు స్పందించి ప్రయాణికుల సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఎగువశోభలో రోడ్డుకు శంకుస్థాపన

ప్రజాశక్తి -అనంతగిరి:మండలంలోని ఎగువశోభ పంచాయతీ గ్రామంలో శుక్రవారం పంచాయతీ సర్పంచ్ కొర్రా .సిహంద్రి ఆద్వర్యన సీసి రోడ్డుకు స్దానిక జెడ్పీటీసీ దీసరి గంగరాజు, ఎంపిపీ శెట్టి నీలవేణి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎగువశోభ పంచాయతీలో సీసీ రోడ్డు నిర్మాణానికి 4.లక్షల 50 వేలు జిల్లా పరిషత్ నిధులతో పనులు చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు.మండలంలో ఉన్న మారు మూల గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పించి అబివృద్ది చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. గ్రామాల అబివృద్ధికికి సర్పంచ్‌లు, ఎంపిటిసిలు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు పి అరుణ, సచివాలయం సిబ్బంది నవీన్, చంద్రమౌళి, సునీల్, గ్రామస్తులు. ఎస్.సుబ్బారావు, సన్యాసి రావు, శాంతారావు, పేతురు పాల్గొన్నారు.

సమస్యల నడుమ వారపు సంతలు

- కానరాని కనీస వసతులు - అవస్థలు పడుతున్న వ్యాపారులు

ప్రజాశక్తి-కొత్తకోట:రావికమతం మండలంలో కొత్తకోట, మేడివాడ వారపు సంత మార్కెట్‌లలో పలు సమస్యలు నెలకొన్నాయి. కొత్తకోటలో శనివారం, మేడివాడ గ్రామాలలో మంగళవారం వారపు సంత మార్కెట్ నిర్వహణ పూర్వం నుంచి కొనసాగుతున్నాయి. ప్రతి ఏటా ఈ వారపు సంతల నిర్వహణతో ప్రభుత్వానికి లక్షల రూపాయలు ఆదాయం సంకూరుతున్నా అందుకు తగిన వసతులు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. గ్రామీణ ప్రాంతం కావడంతో ప్రతి శని, మంగళవా రాల్లో కొత్తకోట, మేడివాడ సమీప గ్రామాల ప్రజలు నిత్యావసర సరుకులైన కూరగాయలు, నాటు కోళ్ల, పాడి గేదెలతో పాటు ఇతర సరుకులకు కొనుగోలు, విక్రయాలు నిర్వహిస్తుంటారు...

నిబంధనలు మేరకు వారపు సంత ప్రదేశాలలో ఆశీల్లు వసూళ్ల చేస్తుంటారు. ఏడాదికి ఒక్కో సంత నిర్వహణ నుంచి లక్షల ఆదాయం సమకూరుతోంది. అ నిధులలో పంచాయతీలకు కొంత నిధులు కేటాయించి



కనీస వసతులు లేని మేడివాడ మార్కెట్ యార్డు



కొత్తకోటలో వృధాగా ఉన్న మార్కెట్ యార్డు

సంత మార్కెట్‌లలో అందుకు తగిన వసతులు కల్పించాలి. చిరు వ్యాపారులకు షెడ్డులు, తాగు నీరు, విద్యుత్ సదుపాయాలు ఏర్పాటు చేయాలి. మేడి వాడ లో చిరు వ్యాపారులకు కనీస వసతులు లేక ఎండైనా, వానైనా నానా అవస్థలు పడుతున్నారు. దుకాణాలు ఏర్పాటుకు ఏ వసతులు లేక నెల పైనే వ్యాపారం కోన సాగిస్తున్నారు. వర్షం వచ్చినా, ఎండ కాచినా వ్యాపారులతో పాటు కొనుగోలుదారులు ఇబ్బందులు పడుతున్నారు.....

కొత్తకోటలో సరైన మార్కెట్ యార్డు సదుపాయాలు లేక రోడ్ల పైనే దుకాణాలు పెట్టి పలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ దుకాణాల కారణంగా గ్రామంలో నిత్యం ట్రాఫిక్ సమస్య వస్తోందని పోలీస్, పంచాయతీ అధికారులు విజ్ఞప్తి మేరకు పూర్వపు మార్కెట్ వెనుక గత ఆరు నెలల కిందట నా బార్డు, గ్రామీణ వికాస్ నిధి, గిరిజన వికాస్ నిధి సహకారంతో సుమారు రూ. 15 లక్షలు ఖర్చు చేసి మార్కెట్‌లో పలు సదుపాయాలు కల్పించారు. సుమారు 30 కు పైగా దుకాణా సముదాయాలు నిర్మించారు. చక్కటి వాతావరణం లో కొనుగోలు దారులకు, చిరు వ్యాపారులకు సదుపా యాలు కల్పించారు. వ్యారులలో బేధాబిప్రాయాలు ఏర్పడి మరలా రోడ్డు పైనే దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో, మరలా ట్రాఫిక్ సమస్య పునా వృతం కావడం తో ప్రజలు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. లక్షల నిధులతో నిర్మించిన దుకాణ సముదాయం వృథాగా ఉంది....



రోడ్డుపై పారుతున్న మురుగునీరు

రోడ్డుపై మురుగునీరు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని ఏఎల్ పురం హైస్కూల్ దగ్గర మురుగునీరు రోడ్డుపై పారుతున్నా అధికారులు పట్టించుకోరా అని ఎంపీటీసీ-2 రుత్తల రామకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, పంచాయతీ అధికారులు కాలవలో ఉన్న చెత్తా చెదారం తీయక పోవటంతో ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ విషయంపై పలు మార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించక పోతే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి ఆందోళన చేస్తామన్నారు.

23న నర్సెస్ అసోసియేషన్ ఎన్నికలు

ప్రజాశక్తి-విశాఖకలెక్టరేట్:ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ నర్సస్ అసోసియేషన్ విశాఖ పట్నం జిల్లా యూనిట్ ఎన్నికలు ఈనెల 23న జరుగుతాయని అసిస్టెంట్ రిజిస్ట్రార్, ఎన్నికల అధికారి బి శ్రీనివాస్ మీడియాకు తెలిపారు. శుక్రవారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈనెల 16న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు కెజిహెచ్ నర్సస్ క్లాక్ రూమ్‌లో నామినేషన్లను స్వీకరిస్తారు. 17న ఉదయం 10 గంటలకు నర్సస్ క్లాక్ రూములో నామినేషన్ల పరిశీలన ఉంటుంది. 18న సాయంత్రం 5 గంటల లోపు నామినేషన్లను ఉపసంహరించుకునే అవకాశం ఉంది. అభ్యర్థులు పోటీలో ఉంటే ఈ నెల 23 న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ ఉంటుందన్నారు. పోలింగ్ ముగిసిన అనంతరం ఓట్ల లెక్కింపు ఉంటుందని తెలిపారు. నామినేషన్లు వేయు అభ్యర్థులు అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి పదవులకు నామినేషన్ ఫీజు రూ.1000 చొప్పన చెల్లించాలని, పాలకవర్గ సభ్యుల పదవులకు రూ.500 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.



ఏర్పాటు చేసిన బొమ్మలు

ఆకట్టుకున్న బొమ్మల కొలువు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: శ్రీ దుర్గా దేవి ఉత్సవాల్లో భాగంగా శ్రీ సత్య సాయి విద్యా విహార్‌లో టీచర్ గా పనిచేస్తున్న తాతా సునీత ద్వారకా నగర్ లోని తన గృహంలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు అందరినీ ఆకట్టుకుంది. రామాయణం, భాగవతం, కృష్ణ లీలలు, పూరీ రథ యాత్ర, మాయాబజార్‌లో పెళ్లి దృశ్యాలు, ఘటోత్కచుడు, నాసా రాకెట్ లాంచింగ్, దశావతారాలు వంటి దృశ్యాలు ప్రతిబింబించేలా బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సునీత మీడియాతో మాట్లాడుతూ, తాను ప్రతి ఏటా దసరా సందర్భంగా బొమ్మల కొలువు ఏర్పాటు చేస్తుంటానని చెప్పారు. గత ఇరవై ఏళ్లకు పైగా ఈ సాంప్రదాయ సిద్ధమైన బొమ్మలకొలువు ఏర్పాటు చేస్తున్నానన్నారు.

538 కిలోల గంజాయి పట్టివేత

పరారైన నిందితులు

ప్రజాశక్తి-పాడేరు:జిల్లా కేంద్రం పాడేరు కు సమీపంలోని చింతలవీధి వద్ద శుక్రవారం ఒక కారులో 538 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నామని స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్ దీనబంధు వెల్లడించారు. ఈ గంజాయి పట్టి వేతకు సంబంధించి ఆయన విలేకరులకు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లాలోని పెదబయలు మండల ప్రాంతం వైపు నుంచి గంజాయితో వస్తున్న కారు చింతల వీధి మెయిన్ రోడ్డు సమీపంలో అదుపుతప్పి రోడ్డు ప్రక్కన ఒక ఇంటి ఆవరణలో నిలిచిపోయిందని తెలిపారు. ఇందులో గంజాయి రవాణా



పట్టుబడిన కారు

జరుగుతున్నట్లు తమకు అందిన సమాచారం మేరకు పాడేరు సబ్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లారని చెప్పారు. కారును స్వాధీనం చేసుకుని స్టేషన్కు తరలించామని గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తులు పరారైపోయారని తెలిపారు. ఈ కారులో రవాణా చేస్తున్న 538 కిలోల గంజాయి విలువ 27 లక్షల రూపాయలు ఉంటుందని తెలిపారు.

ఘనంగా దసరా సంబరాలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ:తెలుగు జర్నలిస్ట్ పోరం ఆధ్వర్యంలో శుక్రవారం దసరా సంబరాలు ఘనంగా నిర్వహించారు. రైల్వే స్టేషన్ సమీపంలోని ప్రముఖ ఫంక్షన్‌లో టీజేఎఫ్ పౌండర్ ఈశ్వర్ చౌదరి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సినీ నటుడు కంచర్ల ఉపేంద్ర బాబు పాల్గొన్నారు. ముఖ్య నాయకులు మాట్లాడుతూ, సమాజ శ్రేయస్సు కోసం కృషి చేసే వ్యక్తులు ఎవరైనా ఉన్నారంటే వారే పాత్రికేయులని అన్నారు. వీరి సంక్షేమం కోసం నిత్యం కృషి చేస్తున్న టీజేఎఫ్ యూనియన్ వ్యవస్థాపకులు ఈశ్వర్ చౌదరి సేవలు అభినందించాలన్నారు. అనంతరం విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో విజయనగరం ఎంపీ కలిసేటి అప్పలనాయుడు, స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఇండిపెండెంట్ డైరెక్టర్ సాగి కాశీ విశ్వనాథ రాజు, వాజీ కమ్యూనికేషన్స్ వాజీ గ్రూప్ ఆఫ్ చానల్స్ ఎండి జి.శ్రీనివాసరావు, లక్ష్మీ గాయత్రి హాస్పిటల్ ఎండి కాంద్రెంగుల వెంకట రామకుమార్, విశ్వనాధ్ గ్రూపు చైర్మన్ కాశీ విశ్వనాథం, జనసేన పార్టీ స్టేట్ డాక్టర్స్ సెల్ ప్రెసిడెంట్ బోడేపల్లి రఘు, సన్ ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూషన్స్ చైర్మన్ శ్రీకాంత్ జాస్తి, బిజెపి పార్టీ అరకు పార్లమెంటరీ ఇంచార్జ్ పరుశురాం రాజు, టి జె ఎఫ్ స్టేట్ ఉపాధ్యక్షుడు జార్జి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ రమణ

అడవి జంతువులను వేటాడటం చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి-పెదబయలు:అడవి జంతువులను వేటాడటం చట్టరీత్యా నేరమని ఎస్ఐ రమణ తెలిపారు.మండలంలో సీకరి పంచాయతీ కేంద్రంలో శుక్రవారం ముగజీవులైన అడవి జంతువులను వదించటం, చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు రైతులు పంట పొలల చుట్టూ విధ్యుత్ కంచెలు అమర్చడంతో విద్యుదాఘాతానికి గురై మనుషులు మృతి చెందుతున్నారన్నారు. విద్యుత్ వైర్లతో కూడిన కంచెను అమర్చినట్లుగా తెలిస్తే వారిపై చట్టాపరమైన చర్యలు తీసుకొంటామని ఆయన హెచ్చరించారు.

14 నుండి పల్లె పండగ

ప్రజాశక్తి -అనంతగిరి:రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని ఈ నెల 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు పల్లె పండుగ వారోత్సవాల నిర్వహించడం జరుగుతుందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కుమార్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 14న అనంతగిరి, ఎగువశోభ, 15న కొత్తురు, చిలకలగెడ్డ. కాశీపట్నం, 16న బొర్రా, టోకురు, కొండిభ, 17న. బీంపోలు, గురుగుబిల్లి, గుమ్మకొట, రొంపలి, 18న పెద్దబిడ్డ, గుమ్మ, వాలసి, లుంగపర్తి 19న వేంగడ, పైనంపాడు, కోనాపురం, 20న .జీనాబాడు, పిన్నకొట, పెద్ద కోట, కివర్ల పంచాయతీలో కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఎంజీ ఎన్ఆర్జిఎస్, గిరిజన సంక్షేమ శాఖ, ఆర్ డబ్ల్యూస్, పంచాయతీ రాజ్ శాఖ ద్వారా చేపట్టిన పలు అబివృద్ధి పనుల పై చర్చిస్తామన్నారు.

పివిటిజిలకు పథకాలను అమలు చేయాలి

ప్రజాశక్తి-చింతపల్లి:పివిటిజీలకు పిఎం జన్మన్ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని సిపిఎం మండల ప్రధాన కార్యదర్శి రామంగి ధనుంజయ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ పార్టీ శాఖా కార్యదర్శులు మర్రి నాగేంద్ర కుమార్, పాంగి కామేశ్వరరావు ఆధ్వర్యంలో చెరువుల వనం గ్రామంలో సభలు నిర్వహించారు. ధనుంజయ్ మాట్లాడుతూ, ఈ పథకం కింద మంచినీరు, రోడ్ల తదితర మౌలిక సౌకర్యాల కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు పాంగి సత్తిబాబు, చంటిబాబు, సుందరావు పాల్గొన్నారు.